
# వర్కింగ్ జర్నలిస్ట్

## సమాచార స్రవంతి


సంపుటి: 15 సంచిక: 5 జూన్ 2026 వెల: రూ5/-



ప్రశ్నే నేరమా?



జర్నలిజంలో విలువ ఎక్కడుందంటే 'జీ'లో.....




కాక్రోచ్ జనత పార్టీ సంచలనం








ఇబ్రహీంపట్నంలో జరిగిన ఎన్టీఆర్ జిల్లా ఫెడరేషన్ మహాసభ దృశ్యాలు



ఎన్టీఆర్ జిల్లా ఎపిడబ్ల్యుజెఎఫ్ నూతన కమిటీ



ఎన్టీఆర్ జిల్లా ఎపిబిజెఎ నూతన కమిటీ



బాపట్లలో మే18న జరిగిన ఫెడరేషన్ జిల్లా మహాసభ
సన్నాహక కమిటీ సమావేశ దృశ్యం



కర్నూలులో ఫెడరేషన్ నిర్వహించిన మణిబాబు
సంతాప సభ దృశ్యం



విశాఖపట్నంలో మే19న జరిగిన ఫెడరేషన్ జిల్లా కార్యవర్గ సమావేశ దృశ్యం

# వర్కింగ్ జర్నలిస్ట్ సమాచార స్రవంతి

సంపుటి: 15 జూన్ 2026 సంచిక: 5

## లోపలి పేజీల్లో...


| | |
|---|---|
| కార్మికుడికి సమ్మె చేసే హక్కు ఉంది ......... | 4 |
| ప్రశ్నే నేరమా? ............. | 5 |
| జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యం ................ | 7 |
| జర్నలిజం విలువ ఎక్కడుందంటే 'జీ'లో.... ...................... | 9 |
| మోడీ మీడియా సమావేశాలు నిర్వహించడపోవడం విచారకరం ...... | 12 |
| కాక్రోచ్ జనత పార్టీ సంచలనం .......................... | 13 |
| సమాంతర మీడియా ....................... | 15 |
| జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరు .................... | 17 |
| జర్నలిస్టుల సొంత ఇంటి కల నెరవేర్చండి ---------------- | 18 |
| మానవీయ దృక్పథ రచనల్లో మేటి తాడి ప్రకాష్................. | 19 |
| అనిర్ధారిత భాష ....... | 21 |
| ఒక్కరు చాలు ...... | 22 |



సంపాదకులు

ఎ.అమరయ్య

వర్కింగ్ ఎడిటర్స్

ఎన్.కొండయ్య ఎం.ఎ.రవూఫ్

సంపాదకవర్గం

జి.ఆంజనేయులు ఎస్.వెంకట్రావు
వి.నవీన్‌రాజ్ ఎమ్. శ్రీనివాస్
బి.ఎన్.ప్రసాదరావు వి.గోపి
వి.రామారావు ఆర్.రామాంజనేయులు
బి. ఈశ్వరరావు కె.వేణుగోపాలరావు
వి.భక్తవత్సలం ఒ.శాంతి
ఎస్.మురళీశంకర్ కె.ఎస్.శంకరరావు
జి. శీనుబాబు డి.మధుసూదనరావు

డిప్యూటీ ఎడిటర్: జిలాని ఎస్.ఎం



PUBLISHED, PRINTED AND EDITED BY
G. Anjaneyulu on behalf of
Andhra Pradesh Working
Journalists Federation
H. No.1-7-9/A, Plot No.40, 402, Surabhi
Sapphire, Golconda 'X' Roads,
Musheerabad, Hyderabad-500 020, A.P.

PRINTED AT
Prajashakthi, M.B. Bhavan, Near RTC Cross
Roads, Hyderabad-500 020.


EDITOR
A.Amaraiah
e-mail:editorworkingjournalist@gmail.com,
Cell: 9347921291
RNI No. APMUL/2009/37690


# ప్రశ్నలు లేని ప్రజాస్వామ్యమిది?!

ప్రశ్నించడం నేరంగా మారిపోయింది. ప్రజలకు అవసరమైన సమాచారం అందుబాటులో పెట్టరు. తెలుసుకోవాలని ప్రశ్నిస్తే నేరంగా పరిగణిస్తారు. పేరుకు మాత్రం అనేక చట్టాలు. ఎటువంటి గోప్యత పాటించని, పారదర్శకతకు పెద్దపీట వేస్తూ సమాచార హక్కు చట్టం తీసుకువచ్చామని చెబుతారు. మరోపక్క ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం పేరు చెప్పి తమకు అందుబాటులో ఉన్న సమాచారం అందించినవారిని అరెస్టు చేస్తారు. లేదా పలురకాల నిర్భంధాలకు గురిచేస్తారు. ఇదిలా ఉంటే ప్రభుత్వాధినేతలు తమకు అనుకూలమైన సంప్రదాయ మీడియాను, సామాజిక మాధ్యమాలను మాత్రం అన్ని సందర్భాలలో అనుమతిస్తారు. తమ అభిప్రాయాలకు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతాయని భావించినవారికి అధికారిక సమాచారం కూడా అందుబాటులోకి రానివ్వరు. ప్రధాని, ముఖ్యమంత్రుల పత్రికాగోష్టులకు అనుమతించరు. పేరుగొప్ప ఊరుదిబ్బ సామెతగా ఉన్నది మనదేశ వ్యవహారం. పేరుకు ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామిక దేశం. ప్రశ్నలను మాత్రం అనుమతించం. ఈ రాష్ట్రంలో, ఈ దేశంలోనే కాదు, విదేశాల్లో కూడా ఎవరు ప్రశ్నించినా స్పందించం. ఇటీవల ప్రధాని నార్వే పర్యటన సందర్భంలో ఉభయ దేశాల ప్రధానులు నిర్వహించిన పత్రికాగోష్టిలో హెల్లే లింగ్ అనే జర్నలిస్టు ప్రశ్నకు బదులివ్వకుండానే ప్రధాని మోడీ అక్కడి నుంచి వెళ్ళిపోయారు. ప్రధానిగా గడిచిన పన్నెండేళ్లకాలంలో ఆయన ఒక్క పత్రికా సమావేశం కూడా నిర్వహించకపోవడంపై ఎడిటర్స్ గిల్డ్ కూడా స్పందించింది. ఈ ధోరణి వివిధ రాష్ట్రాల్లో కూడా కనిపిస్తోంది. యువత ఇకపై ఎంతమాత్రం ఈ స్థితిని సహించబోదని నిరూపించే సంఘటనే ఇటీవల చోటు చేసుకుంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి యువతపై చేసిన వ్యాఖ్యతో కాక్రోచ్ జనత పార్టీ పుట్టుకొచ్చింది. ఇది డిజిటల్ పార్టీ అయినా దానికి వచ్చిన స్పందన దేశంలోని రాజకీయ పార్టీలన్నింటినీ ఆలోచనలోకి నెట్టింది. ఇప్పటికే తమిళనాడులో జరిగిన ఎన్నికల ఫలితాలు యువత ఆలోచనలు ఎంత వేగంగా మారుతున్నాయో చెబితే ఈ బొద్దింకల పార్టీ రాజకీయ పక్షాలకు కొత్త సమస్య తెచ్చిపెట్టేట్టు కనిపిస్తోంది. సమకాలీన రాజకీయాలపై వారు లేవనెత్తిన ప్రశ్నలకు జవాబు చెప్పకుంటే ఇప్పుడున్న రాజకీయ పక్షాలను అధికార పగ్గాలకు ఆమడదూరం పెట్టేందుకు యువత ఎంతమాత్రం వెనకాడబోదనే ధోరణి కనిపిస్తోంది. పెరుగుతున్న అవినీతి, అభద్రత, నిరుద్యోగం యువతలో ప్రస్తుత రాజకీయ పక్షాలపై అసంతృప్తిని పెంచుతోంది. ఎన్నికల్లో చోటు చేసుకుంటున్న అక్రమాలు, అన్యాయాలు, వాటిపై నోరుమెదపని రాజకీయ పక్షాలు, ఫిరాయింపులు, తిరుగుబాట్లు జరుగుతున్నా వాటిని అరికట్టే చట్టాలున్నా అమలుకు నోచుకోని స్థితిని యువత ఎంతోకాలం భరించి చూస్తూ ఊరుకోలేదనే వాస్తవం కట్టెదురుగా కనిపిస్తోంది.

# మీడియాతో మాట్లాడొద్దు

అధికారులు పోలీసులు మీడియాతో మాట్లాడడానికి నిషేధిస్తూ పశ్చిమబెంగాల్‌లోని బిజెపి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అగర్వాల్ జారీ చేసిన ఈ సర్క్యులర్ ఉద్యోగులు, అధికారులు ముందస్తు అనుమతి లేకుండా మీడియాతో మాట్లాడకూడదని ఆదేశించారు. రాష్ట్రంలో సేవలందిస్తున్న ఐఏఎస్ అధికారులతో పాటు పశ్చిమబెంగాల్ సివిల్ సర్వీస్, పశ్చిమబెంగాల్ పోలీస్ సర్వీస్, అన్ని స్వయం ప్రతిపత్తి సంస్థలకు, బోర్డులకు, కార్పొరేషన్లకు ప్రభుత్వ నిధులతో నడిచే విద్యాసంస్థల్లోని ఉద్యోగులకు ఈ ఆదేశాలు వర్తిస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా సర్వీసుల సభ్యులు ఉద్యోగులు ఏ డాక్యుమెంట్ నైనా లేదా సమాచారమైనా ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని మీడియాకు చేరవేయడాన్ని పూర్తిగా నిషేధిస్తున్నాం అని బిజెపి ప్రభుత్వం ఆ సర్కులర్‌లో స్పష్టంగా పేర్కొంది. అలాగే కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఏ విధానాన్ని లేదా నిర్ణయాన్ని ఉద్యోగులు విమర్శించటాన్ని పూర్తిగా నిషేధించినట్లు ఉత్తర్వుల్లో తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వంతో లేదా ఇతర రాష్ట్ర ప్రభుత్వాలతో సంబంధాలు దెబ్బ తినడానికి దారి తీసే విధంగా ఉద్యోగులు ఏ మాధ్యమంలోనైనా ప్రకటనలను, వ్యాఖ్యలను చేయడానికి లేదా అటువంటి పనులు చేసే వారికి సహకరించడానికి కూడా నిషేధించారు. మే 19న జారీ అయిన ఈ ఉత్తర్వులపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



## వడదెబ్బకు విలేకరి మృతి

కైకలూరు ముదినేపల్లికి చెందిన సీనియర్ పాత్రికేయుడు వనబత్తిన విజయకుమార్ (63) వడదెబ్బకు గురై మృతి చెందారు. ఆయన ఒక దినపత్రికలో ముదినేపల్లి మండల విలేకరిగా పనిచేస్తున్నారు. ఆయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఏలూరు జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు జబీర్, హరీష్‌లు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# కార్మికుడికి సమ్మె చేసే హక్కు ఉంది

## తేల్చి చెప్పిన అంతర్జాతీయ న్యాయస్థానం

హక్కుల సాధన కోసం కార్మికులు తాము పని చేసే చోట సమ్మె చేయొచ్చని అందుకు కీలక కార్మిక ఒడంబడిక వీలు కల్పిస్తుందని అంతర్జాతీయ న్యాయస్థానం చరిత్రాత్మక నిర్ణయం వెలువరించింది. ఈ మేరకు కీలక అడ్వైజరిని విడుదల చేసింది. ఐక్యరాజ్యసమితిలో భాగమైన అంతర్జాతీయ కార్మిక సంఘం గతంలో చేసిన ఒడంబడికలో కార్మికులకు సమ్మె హక్కులు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారని దీని చెల్లుబాటును తేల్చాలంటూ ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్‌ను మూడేళ్ల క్రితం ఐఎల్‌ఓ కోరింది. ఈ మేరకు తాజాగా ఐసిజే తన నిర్ణయం వెలవర్చింది. ఐసిజే ఇచ్చే అడ్వైజరిలను ప్రపంచ దేశాల ప్రభుత్వాలు తుచ తప్పకుండా పాటించాలని నిబంధన లేనప్పటికీ ఐక్యరాజ్యసమితి అంతర్గత విభాగమైన ఐసిజే చేసే సూచనలకు అంతర్జాతీయంగా ప్రాధాన్యత ఉంటుంది. కార్మిక చట్టాలు, ప్రమాణాలు, అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలపై ఈ అడ్వైజరీ ప్రభావం చూపనుంది. కార్మికులకు సమ్మె హక్కులను ప్రసాదిస్తూ ఐఎల్‌ఓ చేసిన తీర్మానాన్ని 158 దేశాలు ఆమోదించాయి. ఐరాస కార్మిక చట్టాలు నిబంధనలని పాటిస్తామని తెలిపాయి. ఐఎల్‌ఓలో అమెరికా సభ్య దేశంగా కొనసాగుతున్నప్పటికీ ఈ తీర్మానానికి అగ్రరాజ్యం తన సమ్మతిని తెలుపలేదు. వాతావరణ మార్పుల కట్టడికి ప్రయత్నించని దేశాలను అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించిన దేశాలుగా పరిగణించాలని ఐసిజే గత ఏడాది చరిత్రాత్మకమైన అడ్వైజరిని జారీ చేయడం తెలిసిందే. కార్మికులకు సమ్మె చేసే హక్కు ఉందా అంటూ మొదలైన వాదనలపై 18 దేశాల నుంచి వాదోపవాదాలను హేగ్‌లోని ఐసిజే కోర్టు గత ఏడాది అక్టోబర్‌లో ఆలకించింది. మెజారిటీ దేశాలు కార్మికులకు అనుకూలంగా వాదించటం విశేషం. మెరుగైన జీతభత్యాలు, పని వాతావరణంలో తగు భద్రతా సౌకర్యాల కోసం కార్మికులు సమ్మెకు దిగొచ్చని ఐసిజే అభిప్రాయపడింది.

# ప్రశ్నే నేరమా?





**మో**డీ ప్రభుత్వం గత పుష్కరకాలంగా మీడియా గొంతు నొక్కుతూనే ఉంది. పాత్రికేయులు సంధించే ప్రశ్నల నుంచి తప్పించుకోవడం లేదా సమాచారాన్ని నిరాకరించడం లేదా ఆ సమాచారం వారికి అందుబాటులో లేకుండా చేయడం సర్వసాధారణంగా మారింది. సాక్షాత్తు ప్రధానమంత్రి ఈ కాలంలో స్వదేశంలో కనీసం ఒక్కటంటే ఒక్క పత్రిక సమావేశాన్ని కూడా నిర్వహించలేదు. స్వతంత్ర భారత చరిత్రలో ఈ విధంగా జరగడం ఇదే మొదటిసారి. అయితే కొన్ని సందర్భాలలో పాత్రికేయుల ప్రశ్నలను ఎదుర్కోవడం ప్రధానికి తప్పడం లేదు. ముఖ్యంగా విదేశీ పర్యటనలలో ఈ అనుభవం ఎదురవుతోంది. తాజాగా నార్వేలో పర్యటించిన ప్రధాని మోడీని డాగ్స్ విషెస్ పత్రిక వ్యాఖ్యాత హెల్లె లింక్ కొన్ని ప్రశ్నలు అడిగారు. మోడీతో పాటు భారత అధికారుల బృందం కూడా వాటిని విన్నది. అయితే ఆమె ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండానే మోడీ పత్రిక సమావేశం నుంచి నిష్క్రమించారు.

**ప్రశ్నించే అవకాశమే ఉండదు**

ఆ తర్వాత భారత రాయబార కార్యాలయం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశానికి ఆహ్వానించారు. ఆమె అడిగిన ప్రశ్నలకు డొంక తిరుగుడు సమాధానాలు ఇచ్చారు తప్పించి సూటిగా బదులు ఇవ్వలేదు. భవిష్యత్తులో ఎప్పుడైనా మోడీ భారత పత్రికల నుంచి విమర్శనాత్మక ప్రశ్నలు స్వీకరిస్తారా అని లింక్ ప్రశ్నించగా దౌత్య వేత్త సమాధానం ఇవ్వలేదు. ఇదిలా ఉంటే మరో ప్రభుత్వాధినేతతో కలిసి పత్రికల వారితో మాట్లాడేటప్పుడు ప్రశ్నలను ఎదుర్కోవడానికి మోడీ ఇష్టపడరని అనేక సందర్భాలలో రుజువైంది. ప్రధానిని ప్రశ్నించే అవకాశం ఉండకపోవడం దీనికి కారణం. ఉదాహరణకు మోడీ తన నివాసంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు జోబైడెన్‌కు ఆతిథ్యం ఇచ్చినప్పుడు వాషింగ్టన్ పాత్రికేయులకు ప్రశ్నలు అడిగేందుకు అవకాశం ఇవ్వలేదు.

**ప్రజలకు సమాచారం చేరేదెలా?**

పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వ అధినేత సమాధానాలు ఇవ్వనప్పుడు ప్రజలకు సమాచారం ఎలా చేరుతుంది? జరుగుతున్న పరిణామాలను వారు ఎలా అర్థం చేసుకుంటారు? ఆందోళనలు, సందేహాలు వ్యక్తం చేయడానికి, సమస్యలను లేవనెత్తడానికి దారులు అంతకంతకు మూసుకుపోతాయి. ప్రజాస్వామ్యం అంటే ఐదు సంవత్సరాలకు ఒకసారి ఓటేసి ఆ తర్వాత నోరు మూసుకో అని చెప్పడం కాదు. అది నిరంతర ప్రక్రియ. ఏ ప్రభుత్వ పాలనలో అయినా అది తప్పదు. ప్రజలకు సరైన సమాచారాన్ని చేరవేసేది మీడియా కాబట్టి మీడియాను తన పని తాను చేసుకోనివ్వాల్సి ఉంటుంది. సమాధానాలు చెప్పకపోయినా ప్రశ్నలను స్వీకరించడం అనేది ప్రధాని జవాబుదారీతనాన్ని సూచిస్తుంది. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా బిజెపికి ఓటరు వేసే ప్రతి ఓటు తనకేనని మోడీ విశ్వసిస్తారు. అధికారాన్ని అనుభవించే వ్యక్తులకు బాధ్యతలు కూడా ఉంటాయి. తన పదవి దైవికమైనది అని మోడీ తరచూ చెబుతుంటారు. మరి అలాంటప్పుడు ప్రశ్నలను ఎదుర్కోవడానికి ఆయన ఎందుకు ఇబ్బంది పడుతున్నారో అర్థం కాదు. పైగా పాత్రికేయులు అడిగే ప్రశ్నలు వర్తమానానికి సంబంధించినవే. వాటికి కూడా జవాబు ఇవ్వకపోవడం అంటే అన్నింటికీ తాను అతీతుడనని చెప్పడమే అవుతుంది.

**మీడియా ఏం చేయాలి?**

కార్యనిర్వాహక వ్యవస్థ నేరుగా పార్లమెంటుకు జవాబుదారీగా ఉంటుంది. కానీ ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియాతో సహా అనేక సంస్థలకు కూడా అది జవాబుదారీగా ఉండాల్సిన అవసరం ఉంది. మీడియా కూడా కార్యవర్గ వ్యవస్థను

ప్రశ్నించాలి. సమాధానాన్ని నిరాకరించడం అంటే కార్యనిర్వాహక వ్యవస్థకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడమే అవుతుంది కేవలం పాలకులు అధికారులు చెప్పే విషయాలను వినడం వారిని పొగడ్తలతో ముంచేతలం మీడియా పని కాదు. అది ప్రభుత్వం తరపు మాట్లాడే వారి పని. ఇక్కడ లింగ్ చెప్పిన మాటలను ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. ఆమె ఏమన్నారంటే పాత్రికేయ వృత్తి కొన్ని సందర్భాలలో ఘర్షణపూరితంగా ఉంటుంది. మేము సమాధానాలను ఆశిస్తాము. ఒకవేళ నా ప్రశ్నలకు సరైన సమాధానాలు రాకపోతే అడ్డుపడి మరింత స్పష్టమైన సమాధానాన్ని రాబట్టడానికి ప్రయత్నిస్తాను. అది నా పని... కర్తవ్యం. నాకు సమాధానాలు కావాలి. కేవలం వారు చెప్పేది మాత్రమే కాదు, ప్రజలను గొర్రెల మందలా మార్చకూడదని అనుకుంటే లేదా వారిని మౌనంగా ఉంచకూడదు అని అనుకుంటే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సిందే.

**దిగజారిన ఫోర్త్ ఎస్టేట్ పరిస్థితి**

ప్రభుత్వ మద్దతు దారులు, పాత్రికేయుల గొంతు నొక్కాలని చూసేవారు గతంలో లింగ్‌ను వ్యక్తిగతంగా ట్రోల్ చేసిన ఉదంతాలు ఉన్నాయి. 2023లో ఆమె ఆన్‌లైన్ వేధింపులకు గురయ్యారు. మైనారిటీల విషయంలో భారత ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై మోడీని ప్రశ్నించిన అమెరికా మహిళా పత్రి పాత్రికేయురాలి విషయంలో కూడా గతంలో ఇలాగే జరిగింది. అసభ్యకరమైన అశ్లీలమైన ట్రోల్స్‌తో బాధించడంతో చివరికి శ్వేతసౌధం ఆమెకు మద్దతుగా నిలిచింది. అత్యున్నత స్థానాలలో ఉన్న కొందరు వ్యక్తులు ఇలాంటి ట్రోల్స్‌ను ప్రోత్సహిస్తున్నారు. ప్రపంచ పత్రిక స్వేచ్ఛ సూచీలో నార్వే ఒకటో స్థానంలో ఉండగా భారత్ 157 స్థానంలో ఉండడాన్ని చూస్తుంటే దేశంలో ఫోర్త్ ఎస్టేట్ పరిస్థితి ఎంతగా దిగజారిపోయిందో అర్థమవుతుంది.



# జర్నలిస్టుల గొంతు నొక్కితే ప్రజల గొంతు నొక్కినట్టే

జర్నలిస్టుల గొంతు నొక్కితే ప్రజల గొంతు నొక్కినట్టేనని ఏపీడబ్ల్యూజేఎఫ్ విజయనగరం జిల్లా అధ్యక్షులు కే రమేష్‌నాయుడు అన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై పెట్టిన అక్రమ కేసును వెంటనే ఉపసంహరించుకొని, ఆయనను కించపరిచే ట్రోల్స్ మానుకోవాలని డిమాండ్ చేశారు. నాగేశ్వర్‌పై అక్రమ కేసులు, అసభ్యకర ట్రోలింగ్ ఆపాలని డిమాండ్ చేస్తూ జర్నలిస్టులు ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జర్నలిస్టుల గొంతు నొక్కే ప్రయత్నాలు ఆందోళనకరమని, ప్రొఫెసర్ నాగేశ్వర్ వంటి రాజకీయ విశ్లేషకులకు బెదిరింపులు రావడం భావ ప్రకటన స్వేచ్ఛపై దాడిగా భావించాలన్నారు. మీడియా స్వేచ్ఛను అణచివేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. విమర్శలను తట్టుకునే సంస్కృతి పాలకులకు ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.ప్రసాదరావు, జిల్లా నాయకులు పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని వివిధ వార్తాపత్రికలు, ఛానళ్లకు సంబంధించిన జర్నలిస్టులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని ప్రొఫెసర్ నాగేశ్వర్‌కు తమ సంఘీభావం ప్రకటించారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యం



జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ఇటీవలకాలంలో జర్నలిస్టులపై దాడులు జరగడం బాధాకరమని ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎ ఎన్టీఆర్ జిల్లా మహాసభలో పాల్గొన్న వక్తలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నంలోని స్వర్ణ కన్వెన్షన్ సెంటర్‌లో మే 17న జరిగిన మహాసభకు వివిధ రాజకీయ పక్షాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. అతిథులుగా పాల్గొన్నవారిలో విజయవాడ తూర్పు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మల్లాది విష్ణు, జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల గాంధీ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు జంపాల సీతారామయ్య, టిడిపి అధికార ప్రతినిధి చెన్నుబోయిన చిట్టిబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొర్రా కిరణ్, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, కొండపల్లి కౌన్సిలర్ రావి ఫణి, సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా తదితరులు పాల్గొన్నారు. సమాజంలో జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తున్నారని కొనియాడారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలని, ఈ విషయమై ప్రభుత్వాలపై తాము వత్తిడి తెస్తామని హామీ ఇచ్చారు.

జర్నలిస్టులపై ఇటీవల కాలంలో దాడులు పెరిగాయని, దాడుల నిరోధానికి వీలుగా రాష్ట్రస్థాయిలో హైపవర్ కమిటీ, జిల్లాల్లో కమిటీల నియామకానికి ప్రభుత్వం చొరవ చూపాలని ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. మారిన పరిస్థితుల్లో జర్నలిస్టుల సంక్షేమం అధికంగా దృష్టి కేంద్రీకరించేందుకు ఫెడరేషన్ కృషి చేయాల్సిన అవసరమున్నదని అన్నారు. సంఘాన్ని బలోపేతం చేసేందుకు కలసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. అర్హత కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సూఫీ మతగురువు అల్తాఫ్ బాబా కోరారు. గతంలో ఈ ప్రాంతంలోని జర్నలిస్టులకు ఇంటి స్థలాలు రావడానికి సహకరించానని, ఇకముందు కూడా మిగిలిన జర్నలిస్టులకు ఇంటిస్థలాలు వచ్చేవరకు కృషి సాగిస్తానని తెలుగుదేశం నాయకులు జంపాల సీతారామయ్య హామీ ఇచ్చారు. ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎం.బి.నాథన్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన కార్యకలాపాల గురించి వివరించారు. మహాసభకు అధ్యక్షత వహించిన కలిమిశ్రీ ఆహుతులను వేదికపైకి ఆహ్వానించారు. బ్రాడ్‌కాస్ట్ మీడియా జర్నలిస్టు సంఘాన్ని బలోపేతం చేసేందుకు అవిరళ కృషి సాగిస్తున్నట్టు రాష్ట్ర కన్వీనర్ వీసం శ్రీనివాసరావు తెలియజేశారు. మైలవరం నియోజకవర్గ అధ్యక్షులు షేక్ సల్మాన్, ప్రజాప్రెస్‌క్లబ్ అధ్యక్షులు అడపా కృష్ణ మహాసభ నిర్వహణకు చేసిన కృషి గురించి వివరించారు. ఈ కార్యక్రమాలన్నింటినీ సమన్వయం చేసిన రాఘువులు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నంలో ఫెడరేషన్ బలంగా ఉన్నందునే జిల్లా మహాసభ ఇక్కడ నిర్వహిస్తామని అభ్యర్థించామని, తమ వినతిని జిల్లా నాయకత్వం పరిగణనలోకి తీసుకుని అనుమతించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. మహాసభలో ఫెడరేషన్ ఉపాధ్యక్షులు వెలమ రామారావు, కృష్ణా జిల్లా ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటప్పయ్య, వై.శ్రీనివాసరావు, ఎపిబిజెఎ ఎన్టీఆర్ జిల్లా నాయకులు అలీమ్‌లు సౌహార్ధ సందేశం ఇచ్చారు. అనంతరం ఫెడరేషన్, ఎపిబిజెఎ జిల్లా కమిటీలను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది.

**ఏపీడబ్ల్యుజేఎఫ్ ఎన్టీఆర్ జిల్లా నూతన కమిటీ**

గౌరవ అధ్యక్షులుగా కె కలిమిశ్రీ (సాంబశివరావు) (మల్లెతీగ) అధ్యక్షులుగా ఎం శ్రీనివాస్ (ఆంధ్రజ్యోతి) కార్యదర్శిగా ఎంబి. నాథన్ (ప్రజాశక్తి) కోశాధికారిగా చేబ్రోలు సురేష్ (సాక్షి) ఉపాధ్యక్షులుగా ఏవి నారాయణ (ప్రజాశక్తి), జెవి శ్రీనివాసరావు (పున్నమి), ఎంవి నారాయణ ( ప్రజాశక్తి), వైడి ఆనంద్ (ఫోటో జర్నలిస్ట్), జె.వెంకట్రావు (ప్రజాశక్తి), సహాయ కార్యదర్శులుగా మరీదు చెన్నారావు (ఆంధ్రజ్యోతి), విహెచ్ రాజు (ప్రజాశక్తి), ఏ బాబు (సాక్షి), లాల్ అహ్మద్ గౌస్ (ప్రజాశక్తి), పి.వి. సుబ్రహ్మణ్యం (ఆంధ్రజ్యోతి), మహిళా కార్యదర్శిగా ఎం లక్ష్మీ జ్యోతిర్మయి (ప్రజాశక్తి), కమిటీ సభ్యులు జి.అంజయ్య (సాక్షి), పి మహబాష (ప్రజాశక్తి), జి కిరణ్ బాబు (ఆంధ్రజ్యోతి),






బోయి రవి ( ప్రజాశక్తి), టి శ్రీనివాసరావు (కోస్తా ప్రభ), చొప్పా రాఘవేంద్ర శేఖర్ (మల్లెతీగ), వేముల నాగరాజు (గళంన్యూస్), పల్లె నరేష్ (భారత్ న్యూస్) ఎన్నికయ్యారు.

**ఏపీబీజేఏ ఎన్టీఆర్ జిల్లా నూతన కమిటీ**

గౌరవ అధ్యక్షులుగా అబ్దుల్ అలీమ్(99 టివి), అధ్యక్షులుగా కె రవికుమార్ (10 టీవీ), కార్యదర్శిగా ఎం.రాఘవులు (ఎన్ టీవీ), ఉపాధ్యక్షులుగా జె ప్రసాద్ (టీవీ 5), సెల్వరాజ్ (సి ఛానల్), గుంజా నాగరాజు (10 టివి), సహాయ కార్యదర్శులుగా ఎస్ సాయికుమార్ (సిటీ న్యూస్), ఎం వెంకన్న (మహా న్యూస్), పామర్తి సత్య (మహా న్యూస్), కమిటీ సభ్యులుగా రాజీవ్ రాజు (వే టు న్యూస్), షేక్ షాబాన్ (ఐ త్రీ మీడియా), ఎం సురేష్ (స్వతంత్ర)లు ఎన్నికయ్యారు.

# ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై కేసులు ఎత్తివేయాలి

ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేషకులు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్‌పై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, వాక్ స్వాతంత్ర్యాన్ని కాపాడాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజెఎఫ్) విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. మీడియా స్వేచ్ఛను హరించ వద్దని నినాదాలు చేశారు. తొలుత గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ్, కార్యవర్గ సభ్యులు కె.అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రొఫెసర్ నాగేశ్వర్ అనేక అంశాలపై విశ్లేషణలు చేస్తూ ఉంటారని, ఇటీవల ఆయన చేసిన ఓ వ్యాఖ్యను ఆధారంగా చేసుకుని ఆయనను కొందరు వ్యక్తిత్వ హననానికి పాల్పడడం శోచనీయమన్నారు. ఆయనపై సోషల్ మీడియాలో అసభ్యకర, పోస్టులు పెట్టడం మానుకోవాలని కోరారు . రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్య హక్కును కాలరాసే అధికారం ఎవరికీ లేదని అన్నారు. ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నట్టు ప్రకటించినప్పటికీ ఆయనపై బెదిరింపులకు దిగడం తగదన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు ఎన్.మధు, మదన్, ఈశ్వరరావు, రవిశంకర్, కె.రాజేష్, సతీష్, వరప్రసాద్, భాగ్యరాజ్, శివరామకృష్ణ, చిన్నా, సంతోష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



**తిరుపతిలో**

ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, జర్నలిస్టు ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరుతూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తిరుపతిలో జర్నలిస్టుల నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేసిన జర్నలిస్టులు వివిధ ప్రింట్, బ్రాడ్‌కాస్ట్ మీడియా సంస్థలకు చెందినవారు ఇందులో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గాంధీ, గోపిలు మాట్లాడుతూ మీడియా విశ్లేషకుల పట్ల రాజకీయ నాయకులు వ్యవహరించే వైఖరిని మార్చుకోవాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు శ్రీనివాస్, మోహన్ రావు, కిరణ్ కుమార్, బాలసుబ్రమణ్యం, మణి, కె.కృష్ణ, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిజంలో విలువ ఎక్కడుందంటే 'జీ'లో...

"జర్నలిస్టు బీజీ వర్గీస్ స్మారకోపన్యాసం చేయడానికి నన్ను ఆహ్వానించినందుకు ధన్యవాదాలు. ఒకే ప్రసంగంలో రెండు విషయాలను ఇమడ్చడం సరైన నిర్ణయం కాదని తెలుసు. కానీ ప్రయత్నిద్దాం. నాకు బి.జి. వర్గీస్‌తో సుదీర్ఘ పరిచయమే ఉంది. ఈ రోజు ఇక్కడ అవార్డు విజేతలు నిలబడటం కూడా చాలా అద్భుతంగా ఉంది. దానికి రెండు కారణాలు: ఒకటి, జర్నలిజం ఇంకా బతికే ఉంది. రెండు, ఇది నా ప్రధాన వాదనకు ఒక సంకేతం- అదేమిటంటే, మీడియా, జర్నలిజం అనేవి రెండు చాలా భిన్నమైన అంశాలు.

**మీడియా, జర్నలిజం వేర్వేరు...**

మీడియా, జర్నలిజం తరచుగా ఒకదానికొకటి వ్యతిరేకంగా ఉంటాయి. జర్నలిస్టులకు ప్లాట్‌ఫారమ్‌లు (వేదికలు) కావాలి. కానీ ఇక్కడ అవార్డులు అందుకున్న వారు జర్నలిజానికి ప్రతినిధులు, మీడియాకు కాదు. సాధారణంగా మీడియా ఉపన్యాసాలు అంటే 'వాక్ స్వాతంత్ర్యం', 'ప్రజల పట్ల మీడియా బాధ్యత', 'మనం నాలుగో స్తంభం' (ఫోర్త్ ఎస్టేట్) వంటి పాత మాటలతో నిండి ఉంటాయి. కానీ నేను మీకు కొన్ని కొత్త విషయాలు చెబుతాను.

నాకు ఇష్టమైన స్వామి బియాండానంద చెప్పిన ఒక మాటతో మొదలుపెడతాను. నిజం గురించి ఆయన అభిప్రాయం ఏంటంటే- చాలా నిజాయితీగా చెబుతున్నాను, చాలా మంది నాతో ఏకీభవించకపోవచ్చు. కానీ నాకు ఈ 'అధికారానికి నిజం చెప్పడం' (స్పీకింగ్ ట్రూత్ టు పవర్) అనే ఆలోచనతో సమస్య ఉంది. అంటే అధికారం చాలా అమాయకమైనదని, మనం నిజం చెబితే వాళ్లు అంతా సరి చేస్తారని దీని అర్థమా? నా ఉద్దేశంలో అధికారం ఉన్న వాళ్ల దగ్గర మీకంటే, నాకంటే, జర్నలిస్టులందరి కంటే ఎక్కువ నిజాలు ఉన్నాయి. అసలు విషయం ఏంటంటే.. 'అధికారం గురించి నిజం చెప్పడం' (స్పీకింగ్ ట్రూత్ అబౌట్ పవర్). అదే జర్నలిజం.


**మీడియా అనేది వ్యాపారమే తప్ప బాధ్యత కాదు...**

ప్రజలకు సమాచారం ఇవ్వడం మీడియా బాధ్యత కాదు. ప్రజాస్వామ్యాన్ని నిర్మించడం మీడియా బాధ్యత కాదు. మీడియా బాధ్యతల్లా దాని యజమానులకు డబ్బు సంపాదించి పెట్టడం. ఆ పనిని అది బాగానే చేస్తోంది.

ఎర్నస్ట్ అండ్ యంగ్ నివేదిక ప్రకారం, భారతదేశంలోని మీడియా, వినోద పరిశ్రమ విలువ 2.7 ట్రిలియన్ రూపాయలు అంటే మన లెక్కలో 2 లక్షల 70 వేల కోట్లు. ఇది 80 దేశాల జిడిపి కంటే ఎక్కువ. ఇది మన దేశ వ్యవసాయ బడ్జెట్ కంటే రెండు రెట్లు ఎక్కువ.

ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన భారతీయుడే ఈ దేశంలో అతిపెద్ద మీడియా యజమాని కూడా. అంబానీ జియో, డిస్నీ హాట్‌స్టార్‌ను విలీనం చేసిన ఒక్క లావాదేవీ విలువ 8.5 బిలియన్ డాలర్లు అంటే దాదాపు 71,000 కోట్ల రూపాయలు. ఈ ఒక్క డీల్ భారత మీడియా విలువను 32% పెంచింది. అంటే మొత్తం స్ట్రీమింగ్ రంగంలో 50% పైగా వాటా ఒక్క వ్యక్తి చేతిలో ఉంది. ఒకే వ్యక్తి చేతిలో ఇంత అధికారం ఉండటం గమనించండి.

మీడియాలో ఉన్న ఈ అసమానత విడిగా ఏమీ లేదు. ఇది భారత సమాజంలోని వర్గ, కుల, లింగ అసమానతలకు ప్రతిబింబం.



**పి. సాయినాథ్**

1991లో మన దేశంలో సున్నా డాలర్ బిలియనీర్లు ఉండేవారు. కానీ మార్చి 2026 నాటికి మన దగ్గర 229 మంది బిలియనీర్లు ఉన్నారు. కోవిడ్ సమయంలో దేశ జిడిపి 7.7% పడిపోయినా, బిలియనీర్ల సంఖ్య మాత్రం రెట్టింపు అయింది. అంటే ఆ డబ్బు ఎక్కడి నుండి వచ్చిందో మీకు తెలుసు కదా? ఈ 229 మంది దగ్గర ఉన్న సంపద మన దేశ జిడిపిలో 26%కి సమానం.

నేను 45 ఏళ్ల నా అనుభవంతో రూపొందించిన 'మీడియా సూత్రాలు' (లాస్ ఆఫ్ మీడియా) కొన్ని మీకు చెప్పాలనుకుంటున్నా. అవి..

మీడియా ఎంత ధనవంతురాలిగా మారితే, దాని వార్తల కవరేజీ అంత దరిద్రంగా మారుతుంది.

మీడియా, జర్నలిజం వేర్వేరు. మీడియా అంటే కార్పొరేట్ శక్తులు. వారికి జర్నలిజం పట్ల పట్టింపు లేదు.

మీడియా పని- లాభాలు గడించడం, యజమానులకు డబ్బు సంపాదించడం.

మీడియా ఎవరినైనా 'కొత్త దేవుడు (మెస్సయ్)య' అని, 'ప్రపంచం గుర్తించిన గొప్ప వ్యక్తి' అని, 'మనల్ని స్వర్గానికి తీసుకెళ్లే నాయకుడు' అని చెబితే -ఖచ్చితంగా అతను ఒక నేరగాడు అని అర్థం.

**జర్నలిజంలో 'జే' అంటే జస్టిస్...**

జర్నలిజం విలువ ఎక్కడ ఉందంటే, అందులో 'జే' అంటే జస్టిస్ (న్యాయం) ఉండాలి.

కోవిడ్ సమయంలో దేశం నుండి జరిగిన అతిపెద్ద వలసల గురించి మీడియాలో చర్చ జరిగిందా? లాన్సెట్, డబ్ల్యూహెచ్ఓ భారత్‌లో 40 లక్షలకు పైగా మరణాలు సంభవించాయని చెబితే, మన ప్రభుత్వం కేవలం 4.8 లక్షలు అని చెప్పింది. 'విశ్వగురువు' చెప్పాక ఇక చర్చ ఉండదు. కుంభమేళాకు 66 కోట్ల మంది వచ్చారని ప్రభుత్వం ప్రకటిస్తే, మీడియా దాన్ని గుడ్డిగా నమ్మింది. ఆ లెక్కల ప్రకారం చూస్తే, అంతమంది అక్కడ స్నానం చేయాలంటే ఒక్కొక్కరికి 1 నుండి 3 సెకన్లు మాత్రమే సమయం ఉంటుంది. ఇది పచ్చి అబద్ధం అని తెలిసినా మీడియా ప్రశ్నించలేదు.

భారతీయ మీడియా అత్యంత వివక్షాపూరితమైన సంస్థ. శాసనసభ, న్యాయవ్యవస్థలో కొంతైనా ప్రాతినిధ్యం ఉంటుంది కానీ, మీడియాలో దళితులకు చోటు లేదు. దేశంలో ఇద్దరు దళిత రాష్ట్రపతులు, ఇద్దరు దళిత చీఫ్ జస్టిస్‌లు ఉన్నారు కానీ, ఒక నేషనల్ డైలీలో ఒక్క దళిత 'చీఫ్ సబ్ ఎడిటర్'ను మీరు వెతికినా దొరకరు.

నేటి యువ జర్నలిస్టులకు 'మీడియా బిజినెస్'కి, 'నిజాయితీ గల జర్నలిజం' కి మధ్య ఉన్న స్పష్టమైన రేఖను అర్థం చేసుకోవడానికి ఈ ప్రసంగం ఒక పాఠ్యగ్రంథం లాంటిది.

**జర్నలిజం ఎదుర్కొంటున్న సవాళ్లు..**

"జర్నలిస్టులకు కూడా కొన్ని సమస్యలు ఉన్నాయి. చాలా మంది మేధావులైన జర్నలిస్టులు కూడా 'సామాజిక న్యాయం' అనే అంశం దగ్గరకు వచ్చేసరికి ఓ విధమైన గుడ్డితనాన్ని ప్రదర్శిస్తారు. భారతీయ మీడియా అత్యంత వివక్షాపూరితమైన సంస్థ అని చెప్పడానికి నాకు ఎటువంటి సందేహం లేదు. ఇతర రంగాల్లో (న్యాయం, కార్యనిర్వాహక శాఖల్లో) కనీసం కొంతైనా ప్రాతినిధ్యం కనిపిస్తుంది కానీ, మీడియాలో అది శూన్యం.

మేము 'పారి' లో ఒక ముఖ్యమైన సూత్రాన్ని పాటిస్తాం. ఏదైనా రిపోర్టింగ్ కోసం ఫీల్డ్‌లోకి వెళ్లే రిపోర్టర్లకు మేము చెప్పే మొదటి మాట ఏమిటంటే.. 'మీరు ఒక ప్రత్యేక సౌకర్యం ఉన్న స్థితి (పొజిషన్ ఆఫ్ ప్రివిలేజ్) నుండి ఈ పని చేస్తున్నారని ఎప్పుడూ మర్చిపోవద్దు.' ఆ స్పృహ లేకపోతే మీ పనికి విలువ ఉండదు. అందుకే మేము అట్టడుగు వర్గాల నుండే జర్నలిస్టులను తయారు చేయడానికి ప్రయత్నిస్తున్నాం. ఎందుకంటే 'అనుభవంతో కూడిన ప్రతిభ' (మెరిట్ ఆఫ్ లివ్‌డ్ ఎక్స్‌పీరియన్స్), డిగ్రీలతో వచ్చే ప్రతిభ కంటే చాలా గొప్పది.

జర్నలిజంలో నా గర్వకారణమైన క్షణం ఏదైనా ఉందంటే అది నాకు వచ్చిన 70 అవార్డులు కావు. 2023 ఆగస్టు 3న ఒక కేంద్ర మంత్రి పార్లమెంటులో నా ఫోటో ఉన్న పోస్టర్‌ను పట్టుకుని, నన్ను 'రైతు వ్యతిరేక కార్యకలాపాలకు సూత్రధారి' అని కెమెరాల ముందు చూపించడం. ఆ సమయంలో నేను రాజస్థాన్‌లోని ఒక మారుమూల గ్రామంలో ఉన్నాను. ఢిల్లీ రావద్దని, ఎక్కడైనా దాక్కోమని నాకు ఫోన్ కాల్స్ వచ్చాయి. భయం వేసిందా? ఖచ్చితంగా వేసింది. ఈ ప్రభుత్వంతో జాగ్రత్తగా ఉండకపోతే అది మూర్ఖత్వమే అవుతుంది. కానీ నేను చేయగలిగింది ఒకటే– నా మిత్రులకు, శ్రేయోభిలాషులకు ఒకటే సమాధానం ఇచ్చాను.. 'నేను అటువంటి నాయకత్వ పాత్రను (లీడింగ్ రోల్) ఒప్పుకోను, ఆ సినిమా హీరోయిన్ ఎవరో కూడా నాకు నచ్చలేదు' అని నవ్వుతూ బదులిచ్చాను. ఆ పరిస్థితుల్లో నవ్వుకోవడం తప్ప మనం ఇంకేం చేయగలం?

మరో ముఖ్యమైన విషయం.. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఒక మంచి పని చేసింది. 1.4 బిలియన్ల ప్రజలను లాక్‌డౌన్ చేసినప్పుడు, మీడియాని 'అత్యవసర సేవల' (ఎషన్షియల్ సర్వీసెస్) జాబితాలో చేర్చింది. ఇది నాకు చాలా సంతోషాన్ని ఇచ్చింది. ఎందుకంటే 'అత్యవసర సేవల్లో' ఉన్నవారికి ఉద్యోగ భద్రత ఉంటుంది.

కానీ విచారకరమైన విషయం ఏమిటంటే, ఆ తర్వాతి 12 నెలల్లోనే మీడియా సంస్థలు 3,500 మంది జర్నలిస్టులను, దాదాపు 15,000 మంది మీడియా కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించాయి. దీనిపై ప్రెస్ కౌన్సిల్ ప్రశ్నిస్తే, మీడియా యాజమాన్యాలు చాలా దురహంకారంతో 'ఇది మా అంతర్గత విషయం, మీకు సంబంధం లేదు' అని సమాధానం ఇచ్చాయి. 3,000 మందిని తీసేయడం వల్ల వాక్ స్వాతంత్ర్యానికి భంగం కలగదు అని వారు వాదించడం విడ్డూరం.

ఏఐ ని మనం నియంత్రించాలే గాని...

ఇక ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) గురించి మాట్లాడితే.. ప్రస్తుతం దీనిపై రెండు విభిన్న వాదనలు నడుస్తున్నాయి. ఒకటి–ఏఐ వల్ల అంతా నాశనం అయిపోతుందని భయపెట్టే 'డూమ్ సేయర్స్', రెండు–ఏఐ అన్ని సమస్యలకు పరిష్కారం అని నమ్మే 'యూలోజికల్' వర్గం. కానీ ఈ రెండూ ఒకే సమయంలో వేర్వేరు వర్గాల ప్రజలకు జరుగుతున్నాయి. పాలక వర్గాలకు ఏఐ అపారమైన శక్తిని ఇస్తుంటే, కోట్లాది మంది సామాన్యులకు అది విపత్తుగా మారుతోంది. ఇది మేధోపరంగా సౌకర్యవంతమైన ఆలోచన మాత్రమే. అసలేమిటో చూస్తే, ఈ రెండు అతి ధోరణులు వేగంగా ఒకేసారి ముందుకు వస్తున్నాయి.

ఏఐ దానిని కలిగి ఉన్న, నియంత్రించే, ఉపయోగించే పాలక వర్గాలకు అపారమైన ప్రయోజనాలు, శక్తులు ఇస్తోంది. అదే

సమయంలో ఆ వర్గాల వెలుపల ఉన్న కోట్లాది మందికి ఇది విపత్తును తెస్తోంది. మధ్యతరగతి మీద కూడా ప్రభావం పడుతోంది.

ఎఐ, ఇతర సాంకేతికతలు అనేక సదుద్దేశాల కోసం ఉపయోగించవచ్చు. చాలా టెక్నాలజీలలో ఇదే జరుగుతుంది. కానీ ఇది అసలు ప్రశ్నలను తప్పించడమే.

మనలో చాలా మందికి ఉన్న ఒక శక్తివంతమైన అలవాటు ఏమిటంటే– ముఖ్యమైన ప్రశ్నలను తప్పించుకోవడం.ఎఐ గదిలో కూర్చుని సమాచారాన్ని పోగు చేయగలదు కానీ, ఒక పల్లెటూరి రైతు కళ్లలోని కన్నీటిని, ఒక కూలీ పడుతున్న కష్టాన్ని అది స్వయంగా చూడలేదు. అందువల్ల 'మొదటి రూల్ గా మీరు ఫీల్డ్‌లోకి వెళ్లాల్సిందే.' ఫీల్డ్ రిపోర్టింగ్ లేని జర్నలిజం, ప్రాణం లేని బొమ్మ లాంటిది. ఎఐ ఇచ్చే డేటా కంటే, మీరు స్వయంగా సేకరించే 'అనుభవపూర్వక నిజం' (లివ్‌డ్ ఎక్స్‌పీరియన్స్) ఎప్పుడూ గొప్పది.

ఏఐ ఎవరి సొత్తు? ఎవరు నియంత్రిస్తున్నారు? ఎవరు డిజైన్ చేస్తున్నారు? ఎవరి ప్రయోజనాల కోసం డిజైన్ చేస్తున్నారు? ఎవరు లాభపడుతున్నారు? ఎవరు నిర్ణయాలు తీసుకుంటున్నారు? ఎవరి కోసం ఇది రూపొందింది?

ఇది గొప్ప పనులు చేయవచ్చు, అలాంటి సందర్భాలూ ఉంటాయి. కానీ అదే అన్ని టెక్నాలజీలకు వర్తిస్తుందా? మీరు మీ టీని గన్ బారెల్‌తో కలపవచ్చు. కానీ గన్ పని అది కాదు. గన్ టీ కలపడానికి తయారు కాలేదు. కానీ యజమాని తన కల్పనలో అలా ఉపయోగించవచ్చు.

ఇప్పుడు నేను మీకు వాస్తవ గణాంకాలు చెబుతున్నాను.

2025 మార్చిలో గ్రాక్ అనే ఎఐ సంస్థ–తన యజమాని ఎలాన్ మస్క్‌ను "ప్రముఖ తప్పుడు సమాచారం వ్యాప్తి చేసే వ్యక్తి" అని వర్ణించింది. అంతేకాదు, అది రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ గురించి కూడా కొన్ని మంచి విషయాలు చెప్పింది.

2025 మేలో గ్రాక్, దక్షిణ ఆఫ్రికాలో "వైట్ జెనోసైడ్" ఆరోపణకు ఎలాంటి విశ్వసనీయ ఆధారాలు లేవని చెప్పింది. దీనిపై దాని యజమాని అసహనం వ్యక్తం చేశాడు.

సెప్టెంబర్ 2025లో గ్రాక్ కోసం పని చేసిన 500 మంది డేటా అనోటేటర్లు ఒక్కరోజు నోటీసుతో ఉద్యోగం కోల్పోయారు. ఎఐ తన యజమానిని ప్రశ్నించగలదు. కానీ అది యజమాని అనుమతితోనే జరుగుతుంది.

నేను ఎఐని పూర్తిగా తిరస్కరిస్తానా? కాదు. నా వద్ద ఉన్న ఎఐ ఆధారిత నోట్ టేకర్ అద్భుతంగా పనిచేస్తుంది. ఇది 112 భాషల్లో రికార్డింగ్, ట్రాన్స్‌క్రిప్షన్, అనువాదం చేస్తుంది.

కానీ నేను ఇంకా చేతితోనే రాస్తుంటాను. నోట్స్ తీసుకుంటాను. ఎఐ మీద పూర్తిగా ఆధారపడటం చాలా ప్రమాదకరం. అది మీ కోసం వ్యాసాలు రాయదు. దానికి సందర్భం ఉండదు.

చాట్ జిపిటి వంటి వ్యవస్థలు తప్పులు చేస్తాయి. ఉదాహరణకు యుజిసి ఒకసారి వేదిక్ మాథమాటిక్స్ సిలబస్ అడిగింది. చాట్ జిపిటి ఇచ్చిన 10 పుస్తకాలలో 4 అసలు లేవు.

ఎఐ కొంతవరకు పునరావృత పనులను తగ్గించవచ్చు. కానీ సృజనాత్మకకు అది ప్రతీక కాదు. జర్నలిజం విషయంలో కూడా ఎఐ వంటి "కృత్రిమ సమాచారం" ఉత్పత్తి చేసే ధోరణి ఉంది.

మరీ ముఖ్యంగా, కార్పొరేట్ శక్తి, ఫైనాన్స్ క్యాపిటల్, డిజిటల్ కాలనియలిజం వంటి అంశాలను పరిగణలోకి తీసుకోకుండా ఏ విశ్లేషణ కూడా పూర్తి కాదు.

ఎఐ లక్ష్యం ఏమిటంటే – మానవజాతి జ్ఞానం మొత్తాన్ని సేకరించి, దాన్ని బిలియనీర్ల కోసం లాభదాయకంగా మార్చడం. కొందరిని ట్రిలియనీర్లుగా కూడా చేయవచ్చు.

ఎఐ ప్రపంచంలోని జ్ఞానాన్ని సేకరించినా, అది కొన్ని వ్యవస్థలకు ప్రాధాన్యం ఇస్తుంది, మరికొన్నింటిని తగ్గిస్తుంది. భాషలలో కూడా అది వైవిధ్యాన్ని తగ్గించేలా ఏకరూపత (హోమోజనైజేషన్) వైపు దారితీస్తుంది. ప్రాంతీయ భిన్నతలను తగ్గిస్తుంది.

ఉదాహరణకు ఒకే భాషలో వివిధ ప్రాంతాల్లో మాట్లాడే విధానాలను పూర్తిగా పట్టించుకోకపోవచ్చు. ఎఐ తనకు అందిన డేటాలో ఉన్న పక్షపాతాలను ప్రతిబింబిస్తుంది. ఉదాహరణకు కుల పక్షపాతాలు.

అధ్యయనాల్లో జిపిటి–4 ఒకసారి కొన్ని ఇంటిపేర్లను కొన్ని వృత్తులతో జత చేసింది. కొన్ని కులాలకు చెందిన పేర్లను మాన్యువల్ స్కావింజర్ వంటి పనులతో అనుసంధానించింది. ఇది ఆశ్చర్యకరం కాదు– ఎందుకంటే ఎఐ మన సమాజాన్ని మోడల్ చేస్తోంది.

న్యాయవ్యవస్థ, మీడియా, అకాడెమియా––ఆల్ దీస్ సెక్టార్స్ రిఫ్లెక్ట్ బయాసెస్. ఎఐ కూడా అదే చేస్తుంది. ఎఐ ఉపయోగంతో నకిలీ కేసులు, నకిలీ రెజ్యూమేలు, తప్పుడు వైద్య సలహాలు వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఎఐ ఒక నమ్మకమైన శాస్త్రీయ రూపం అనే భావన పెరుగుతోంది. కానీ అది వాస్తవానికి "ఎంటిఫికేషన్–'ఎన్–షిట్టి–ఫికేషన్'" అనే ధోరణిని పెంచుతోంది. (ఏదైనా ఒక ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్– ఉదాహరణకు ఫేస్‌బుక్, గూగుల్, లేదా ఏదైనా న్యూస్ యాప్– మొదట్లో వినియోగదారులకు (యూజర్స్) చాలా మంచి సేవలను ఉచితంగా అందిస్తుంది. అందరూ దానికి అలవాటు పడ్డాక, నెమ్మదిగా ఆ సేవలను తగ్గించి, కేవలం ప్రకటనల (యాడ్స్) ద్వారా

డబ్బు సంపాదించడం మీద మాత్రమే దృష్టి పెడుతుంది. దీనివల్ల ఆ ప్లాట్‌ఫారమ్ నాణ్యత పూర్తిగా దెబ్బతినడాన్నే 'ఎన్–షిట్టి–ఫికేషన్' అంటారు.)

ఒక్క మాటలో చెప్పాలంటే– టెక్నాలజీ మనల్ని నడిపించకూడదు, మనమే టెక్నాలజీని ప్రజల పక్షాన నిలబడేలా నడిపించాలి. అప్పుడే మనం నిజమైన జర్నలిస్టులుగా మన బాధ్యతను నెరవేర్చగలం. ఎఐ ప్రస్తుత వ్యవస్థను మార్చదు, దాన్ని మరింత బలపరుస్తుంది. పెద్ద కార్పొరేట్లకు మరింత లాభం చేకూరుస్తుంది.

ఇది మార్చవచ్చా? అవును. కానీ ఏకఛత్రాధిపత్యాలు, గుత్తాధిపత్యాలు పోవాలి. కఠిన నియంత్రణ కావాలి. ప్రజా యాజమాన్యం అవసరం.

మేము ప్రతిరోజూ గబ్బిలాలా దాడికి గురవుతున్నాము. మా కంటెంట్‌ను చోరీ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. మేము అనేక భాషల్లో ప్రచురిస్తాం. కానీ మా కంటెంట్‌ను ఇతరులు ఉపయోగిస్తున్నారు. ఎఐ సమాజంలోని అసమానతలను ప్రతిబింబిస్తుంది.

చివరిగా, జర్నలిజం ఓ కష్టతరమైన ముఖ్యమైన రంగం. నిజమైన జర్నలిజం అంటే న్యాయం కోసం పనిచేయడం. మీరు స్వతంత్ర మీడియాను మద్దతు ఇవ్వాలి. పెద్ద కార్పొరేట్ నియంత్రణకు వ్యతిరేకంగా నిలబడాలి. చరిత్రలో కూడా జర్నలిస్టులు గడ్డు పరిస్థితుల్లో పని చేశారు. గాంధీ, అంబేద్కర్ వంటి వారు రచనలు చేశారు. భగత్ సింగ్ కూడా అనేక భాషల్లో రచనలు చేశారు.

జర్నలిజం అంటే న్యాయం కోసం పోరాటం. ఇది సాధ్యమే, కానీ సులభం కాదు.

**(రామన్ మెగసెసె అవార్డు గ్రహీత పాలగుమ్మి సాయినాథ్ బి.జి.వర్గీస్ స్మారకోపన్యాసం చేసిన సందర్భంలో మాట్లాడినది)**

# మోడీ మీడియా సమావేశాలు నిర్వహించకపోవడం విచారకరం

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన పన్నెండేళ్ల పదవీకాలంలో ఒక్క మీడియా సమావేశం కూడా నిర్వహించడపోవడం విచారకరమైన వాస్తవమని ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా విమర్శించింది. మీడియాను "శత్రువు"గా చూడడం మానుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. ఇటీవల మోడీ నార్వే, నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా విదేశీ పాత్రికేయులు, భారత అధికారుల మధ్య తీవ్ర వాగ్వాదాల ఘటనలను "ఇబ్బందికరమైనవి"గా అభివర్ణించింది. పత్రికా సమావేశం అనంతరం స్థానిక పాత్రికేయుల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడానికి ప్రధాని నిరాకరించడంతో విదేశీ మీడియాతో ఈ గొడవ మొదలైందని ఎడిటర్స్ గిల్డ్ పేర్కొంది. అంతర్జాతీయ పత్రికాస్వేచ్ఛ ర్యాంకింగ్‌లపై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ ఈ ర్యాంకింగ్‌లో భారత్ "దారుణమైన" స్థానంలో ఉండడం తీవ్ర ఆందోళన కలిగించే విషయంగా మిగిలిపోయిందని ఎడిటర్స్ గిల్డ్ పేర్కొంది. ప్రపంచ పత్రికాస్వేచ్ఛ సూచికలో నార్వే, నెదర్లాండ్స్ వరుసగా మొదటి, రెండవ స్థానాల్లో నిలవగా మొత్తం 180 దేశాల్లో భారత్ 157వ స్థానంలో ఉందని ఎడిటర్స్ గిల్డ్ గుర్తుచేసింది. మే 18న నార్వే జర్నలిస్టు హెల్లె లింగ్ స్వెండెన్స్ మీడియా ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా మోడీ నిరాకరించడం ప్రపంచవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలోనే ఎడిటర్స్ గిల్డ్ ఈ ప్రకటన చేసింది.



# నందికొట్కూరు నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు

నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా కన్వీనర్ జి మద్దయ్య యాదవ్, సీనియర్ జర్నలిస్ట్ పానుగంటి చంద్రయ్యలు ప్రారంభించారు. నందికొట్కూరులోని బసిరెడ్డి డిగ్రీ కళాశాలలో ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల సమావేశాన్ని నిర్వహించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆరంభించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు బనగానపల్లె చంద్రశేఖర్, శివప్ప, డివి నాయక్, జయరాం, డాలు శేషన్న, మిడుతూరు సుబ్బయ్య, పాములపాడు గోవిందు, చంద్రయ్య, జూపాడు బంగ్లా గోపాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# కాక్రోచ్ జనత పార్టీ సంచలనం




భారత రాజకీయాల్లో కలవరం సృష్టించిన కాక్రోచ్ జనతా పార్టీ. భారత ప్రధాన న్యాయమూర్తి కోర్టులో చేసిన వ్యాఖ్యలతో (అనంతరం ఆయన వాటిని సవరించారు) ఆన్‌లైన్‌లో పుట్టిన పార్టీ కాక్రోచ్ జనతా పార్టీ. ఈ పార్టీ సృష్టికర్త అభిజిత్ దిప్కే. ఆన్‌లైన్‌లో పలు అంశాలపై స్పందనలు, విమర్శలు, ప్రతివిమర్శలు రావడం సహజం. అయితే ఈసారి యువత నుంచి వచ్చిన స్పందన భారతదేశ రాజకీయ పార్టీలన్నింటినీ ఒక కుదుపు కుదిపింది. అధికార, విపక్షాలనే తేడా లేకుండా పోయింది. ఆన్‌లైన్ పార్టీ పుట్టుకకే అదిరిపోయిన అధికారగణం ఎక్స్‌లో ఆ పేజీ కనిపించకుండా చేశారు. అయినా కూడా లక్షల సంఖ్యలో యువత ఈ ఆన్‌లైన్ పార్టీకి ఆకర్షితులవుతున్నారు. ఇప్పటికి అందుతున్న వివరాన్ని బట్టి ఈ పార్టీ ఆధ్వర్యంలో బెంగుళూరులో మానవహారం రూపుదాల్చే ప్రయత్నం, అందుకు పోలీసులు అడ్డుకున్నట్టు సమాచారం. త్వరలో బీహార్‌లో జరగబోయే ఉపఎన్నికలో సిజెపి తరఫున అభ్యర్ధిని బరిలోకి దించే ప్రయత్నాలు జరుగుతున్నట్టు వినికిడి.

**యువతలో ఎందుకీ ఆగ్రహం?**

కేవలం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలతో పెల్లుబికిన ఆగ్రహం కాదిది. అదొక నిప్పురవ్వ మాత్రమే. యువతలో సుదీర్ఘకాలంగా పేరుకుపోతున్న అసహనం, నిరసన ఈ రూపంలో ప్రదర్శితమైంది. దేశంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, ఎన్నికల సమయంలో పార్టీలు చేస్తున్న వాగ్దానాలు, అవి అమలుజరుగుతున్న తీరుతెన్నులు ఈ ఆగ్రహాన్ని మరింతగా పెంచాయి. అయితే అది వీధుల్లో హింసాత్మక సంఘటనల రూపంలో కాకుండా నిర్మాణాత్మకంగా, వ్యంగ్యంగా తమదైన శైలిలో సరికొత్త రూపంలో నిరసన వ్యక్తం చేశారు. లక్షల సంఖ్యలో అనుసరించేవారు చేరడంతో ఆ పార్టీకొక నియమావళిని ప్రకటించారు. పార్టీలో చేరాలంటే ఎటువంటి నియమ, నిబంధనలు ఉండాలో చెప్పారు. అంతటితో ఆగకుండా పలు అంశాలపై పార్టీ మానిఫెస్టో ప్రకటించారు.

నిరుద్యోగ యువత, సోమరితనంతో గడిపేవారు, రోజులో ఎక్కువ సమయం ఇంటర్‌నెట్‌లో సమయం వెచ్చించేవారు, కారుకూతలకు సమయం వెచ్చించేవారు ఈ పార్టీలో సభ్యులుగా చేరవచ్చునని అభిజిత్ దిప్కే పేర్కొన్నారు. ఈ పిలుపునకు భారత యువత నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. అతి స్వల్పసమయంలో లక్షల సంఖ్యలో యువకులు ఈ పార్టీలో చేరారు. ఈ స్పందనతో అధికార పార్టీ బెంబేలెత్తిపోయింది. దీని వెనక రాజకీయ పార్టీల కుట్రలున్నాయని, ప్రతిపక్షాలు అధికార పక్షాన్ని అభాసుపాలు చేసేందుకు సాగించే యత్నంగా చూపాలని శాయశక్తులా ప్రయత్నించాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలకు ఇంటర్నెట్‌లో ఉండే అనుచరగణాన్ని మించిన సంఖ్యలో సిజెపిలో చేరారు. వచ్చిన విమర్శల్లోని నిజానిజాల గురించి ఆరాతీస్తే అభిజిత్ పూర్వాశ్రమంలో ఆప్ పార్టీ కోసం రెండేళ్లు వలంటీర్‌గా పనిచేశాడని ఆయనే పలు టీవీ ఛానళ్లకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో చెప్పుకున్నాడు. నిజానికి అభిజిత్ బోస్టన్ విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్నాడు. మొదలైన రాజకీయ ప్రచారం చిన్న నిప్పురవ్వ అతి తక్కువ సమయంలో దావాలనంగా మారింది. భారత రాజకీయాల్లోని అవినీతి, ఆశ్రిత పక్షపాతం, ఫిరాయింపులు, పార్టీ నిధి పేరిట సాగించే వసూళ్ళు, అధికారాన్ని అడ్డుపెట్టుకుని సాగించే వివిధ రకాల విన్యాసాలు, ఎన్నికల సందర్భంగా జరిగే అవకతవకలు, నీట్ పరీక్ష వాయిదా కారణంగా నిరాశలో కూరుకుపోయిన యువత తదితర అంశాలన్నింటిపై తమదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించే పనిలో కాక్రోచ్ జనత పార్టీ పడింది.

డిజిటల్ రూపంలో వెల్లువెత్తిన ఈ ఆగ్రహం రాబోయే రోజుల్లో ఏ రూపం తీసుకుంటుంది? యుపిఏ హయాంలో ఢిల్లీలో రేప్‌కు గురైన యువతి విషయంలో యువతలో పెల్లుబికిన ఆగ్రహం దిశ చట్ట రూపకల్పనతో చల్లారింది. ఇప్పుడు యువత లేవనెత్తిన అంశాలపై రాజకీయ పక్షాల స్పందనతో వారిని సమాధానపరుస్తుందా? లేక కొద్దికాలం పాటు ఉధృతంగా సాగి మెల్లగా చల్లారిపోతుందా? లేక దేశ యువత ఏకమై సమస్యల ప్రక్షాళనకు నడుం బిగించి ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదుగుతుందా? అన్నది కాలమే నిర్ణయించాలి!

# ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై బెదిరింపులు, అక్రమ కేసులు

ప్రముఖ జర్నలిస్టు రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ ఒక రాజకీయ చర్చలో వెలిబుచ్చిన అంశాలపై జనసేన, తెలుగుదేశం పార్టీల కార్యకర్తలు బెదిరింపులకు దిగడమే కాక కాకినాడలో అక్రమంగా ఆయనపై కేసులు బనాయించారు. రాజకీయ అంశాలపై తమకు అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా చేసిన విశ్లేషణపై రెండు పార్టీల కార్యకర్తలు ఆయనపై ట్రోల్స్ చేశారు. నాగేశ్వర్ తాను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించారు. అయినా అయనను అరెస్టు చేస్తారనే భయానక వాతావరణం సృష్టించారు. ఆయన రక్షణ కోసం తెలంగాణ పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చింది.

**ఫెడరేషన్ ఖండన**

ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను ఇటీవల కాలంలో తెలుగుదేశం, జనసేన పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున బెదిరింపులకు దిగి అక్రమ కేసులు బనాయించడంపై ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తున్నది. ఇటీవల ఒక రాజకీయ చర్చ గోష్టిలో ప్రొఫెసర్ నాగేశ్వర్ వెలువరించిన కొన్ని అభిప్రాయాల పట్ల కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ వ్యాఖ్యలను ప్రొఫెసర్ నాగేశ్వర్ ఉపసంహరించుకున్నారు. వాస్తవానికి జర్నలిజం లో అభిజ్ఞ వర్గాల సమాచారాన్ని ఉటంకిస్తూ అనేకమైన చర్చా గోస్టులు జరుగుతున్నాయి. ప్రొఫెసర్ నాగేశ్వర్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నప్పటికీ రాజకీయ పార్టీల కార్యకర్తలు ఆయనపై పెద్ద ఎత్తున ప్రచార దాడికి దిగటం, అధికార పక్షమే పరోక్షంగా ఆయనను బెదిరిస్తూ వ్యాఖ్యలు చేయటం సరైనది కాదు. ప్రజాస్వామ్యంలో భావవ్యక్తీకరణ ఒక భాగం. భావవ్యక్తీకరణ స్వేచ్ఛ పట్ల పదేపదే సానుకూలంగా మాట్లాడే ఉప ముఖ్యమంత్రి, అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన క్యాడర్ ఆయనపై బెదిరింపులకు దిగడం, హెచ్చరికలు చేయటం సరికాదు. భావ ప్రకటన స్వేచ్ఛను హరించే ఈ వైఖరిని పాలక పక్షాలు విడనాడాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు కోరారు. ఆయనపై అనేకచోట్ల జనసేన నాయకులు, కార్యకర్తలు పెట్టిన కేసులను తక్షణం ఉపసహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**విజయవాడలో**

సీనియర్ జర్నలిస్ట్, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌పై రాష్ట్రంలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో నమోదైన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న బెదిరింపులను ఆపాలని ఈ దాడులను ఖండిస్తూ, ప్రొఫెసర్ నాగేశ్వర్‌కు సంఘీభావంగా మే 28న విజయవాడ లెనిన్ సెంటర్‌లో ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లో జరిగిన ధర్నాలో ఏపీడబ్ల్యూ జేఎఫ్ అధ్యక్షులు ఎస్ వెంకట్రావు, రాష్ట్ర నాయకులు షేక్ ఖాజావలి, ఏపీబీజేఏ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎం రాఘవులు, ఏపీడబ్ల్యూజేఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం శ్రీనివాస్, ఎంబీనాథన్, జిల్లా గౌరవ అధ్యక్షులు కే కలిమిశ్రీ, జిల్లా కోశాధికారి సురేష్ బాబు జిల్లా నాయకురాలు జ్యోతిర్మయి జిల్లా నాయకులు విహెచ్ రాజు, పి నరేష్ కే మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



# సమాంతర మీడియా

సంప్రదాయ మీడియా వేదికలకు సమాంతరంగా డిజిటల్ మీడియా ఎదుగుతూ వస్తోందన్న విషయం చాలామంది అనుబంధం ద్వారా గమనిస్తున్న అంశమే. ఇప్పుడు దాని పరిధి దాటి విస్తారంగా విస్తరిస్తోంది. కరోనా ముగిసిన కాలంలో మరింతగా తలుపులు తెరచుకున్నాయి. అనంతరం ఇంకా ఉధృతి పెరిగింది. దీని రూపం త్వరలోనే విక్రమ స్వరూపం దాలుస్తుందని అందరూ వేస్తున్న అంచనా. ఆండ్రాయిడ్ వ్యవస్థ ఊపందుకున్న నేపథ్యంలో అరచేతుల్లోనే సమస్తం దర్శించుకునే సంస్కృతిలోకి సమస్త ప్రపంచం వచ్చింది. ప్రింట్ మోడ్‌లో ఉన్న పేపర్లు, టీవీలో వచ్చే చానల్స్‌లో చూడడం లేదని దాని అర్థం కాదు. కానీ పాఠకుల, వీక్షకుల అలవాట్లు శరవేగంగా మారిపోతున్నాయి. మొబైల్ ఫోన్లు లేని వ్యక్తులు చాలా తక్కువ మంది ఉంటారు. ఈ పరిణామాలను గమనిస్తున్న మీడియా వర్గాలు అందుకు అనుగుణంగా డిజిటల్ వేదికలను సమాంతరంగా పెంచుకుంటూ వెళుతున్నాయి. మరికొందరు డిజిటల్ మీడియా మాత్రమే నడుపుతున్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న పరిణామం.

మనదేశంలోని కొన్ని ప్రముఖ మీడియా సంస్థలు సభ్యులుగా ఉంటూ డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ అసోసియేషన్‌ను స్థాపించారు. వీరందరూ తరచూ సమావేశం అవుతూ ఉంటారు. సాధక బాధకాలు, కష్టనష్టాలు చర్చించుకుంటూ ఉంటారు. ముఖ్యంగా బిగ్ టెక్ కంపెనీల ఆధిపత్యం తమకు జరగాల్సిన న్యాయం, దక్కాల్సిన లాభంపై వారంతా ప్రధానంగా దృష్టి పెడుతున్నారు. అందులో భాగంగా తాజాగా కూడా కొన్ని సమావేశాలు జరిగాయి. వెబినార్ రూపంలో జరుగుతున్న సందర్భాల్లో విదేశీ సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొంటూ ఉంటారు. ప్రస్తుతం 17 భారతీయ సంస్థలు సభ్యులుగా ఉన్నాయి. కంటెంట్‌ను ప్లాట్‌ఫార్మ్‌పై పెడుతూ ప్రసారం/ప్రచురణలతో పాటు ఆదాయాన్ని పంచే వ్యవస్థలు, సంస్థలు డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ మధ్య అనుబంధం ఆరోగ్యకరంగా సాగడమే ప్రధానమైన ఉద్దేశం. మనతోపాటు ఆస్ట్రేలియా, కెనడా, అమెరికా మొదలు అనేక దేశాల్లో సంబంధిత వ్యవస్థల మధ్య ముఖ్యంగా ఆదాయం విషయంలో వివాదాలు నెలకొంటున్నాయి. ఆస్ట్రేలియా వంటి దేశాల్లో కొన్ని పరిష్కారాలను పొందినట్లుగా తెలుస్తోంది. మిగిలిన దేశాలకు కూడా విస్తరణ జరగాలని అందరి అభిలాష. బిగ్ టెక్ కంపెనీల జాబితాలో ప్రధానంగా గూగుల్, అమెజాన్ కనిపిస్తున్నాయి. కంటెంట్‌ను వాడుకుంటున్న ఈ సంస్థలు న్యూస్ పబ్లిషర్స్‌కు ఆదాయాన్ని పంచడంలో అన్యాయం జరుగుతోందన్నది ప్రధాన చర్చనీయాంశం. ఆయా దేశాల ప్రభుత్వాల సహకారం మీడియా సంస్థలకు అందాల్సి ఉంది. చట్టాలను రూపొందించడం, అమలు చేయడం సంస్థలకు అన్ని రకాలుగా రక్షణ కల్పించడం నిజంగానే ప్రభుత్వాల బాధ్యత. ఏ ఏ దేశాల్లో ప్రభుత్వాలు ఏ రకంగా ప్రవర్తిస్తున్నాయో తెలుసుకోవడం కూడా కీలకం. మీడియా సంస్థలన్నీ కలిసి తమ బంధాన్ని బలోపేతం చేసుకోవాలని చూస్తున్నాయి. ఇది మంచి పరిణామమే. కాకపోతే ఆచరణ విషయంలో ఐకమత్యం పట్ల అనుమానాలు లేకపోలేదు. ఈ మొత్తం ఎపిసోడ్‌లో అంతర్జాతీయంగా ఉన్న ఉత్తమ పద్ధతులను అనుసరించటమే తరుణోపాయం. కంటెంట్ షేరింగ్ విషయంలోనూ ఒక కూటమి ఏర్పడటం అవసరంగా మీడియా సంస్థలు గుర్తిస్తున్నాయి. కెనడాలో తీసుకురాబోతున్న చట్టాలు బలంగా పారదర్శకంగా ఉంటాయని విశ్వాసాన్ని డీఎన్‌పిఏ సభ్యులు వ్యక్తం చేసినట్లు సమాచారం. మీడియా సంస్థలు టెక్ కంపెనీల మధ్య జరిగే ఒప్పందాలు వాటి అమలు తీరే కీలకం. ప్రచురణ కర్తలను విభజించి పాలించాలనే వ్యూహంలో గూగుల్ ఉన్నట్లు వీరందరూ భావిస్తున్నారు. ఆస్ట్రేలియా, కెనడాలో అమలవుతున్న విధానాలే భారత్‌లోనూ రావాలన్నది వీరి ఆకాంక్ష. టెక్ కంపెనీలు పబ్లిషర్ల మధ్య బేరసారాలు ఉండాలన్నది వీరందరి అభిమతం. ఆదాయం పంపకంలో పారదర్శకత ముఖ్యం. చట్టాలు తీసుకువచ్చినా ఫేస్‌బుక్, గూగుల్ వంటి సంస్థలు అవి తమకు వర్తించకుండా మీడియా పబ్లిషర్స్‌తో ఒప్పందాలు చేసుకుంటున్నాయనే మాటలు కూడా వినపడుతున్నాయి. అటువంటి పరిస్థితుల్లో బిగ్ టెక్ కంపెనీ కంపెనీలు దారికి రావడం అంత తేలిక కాదు. మీడియా సంస్థలన్నీ ఏకమై చట్టాలను తెచ్చుకోవాలి. ఆదాయంతో పాటు కంటెంట్‌లో నాణ్యత పెరగడం అతి ముఖ్యం. భారతదేశంలో డిజిటల్ మీడియాను నడుపుతున్న సంస్థలు ఎన్నో ఉన్నాయి. ఎంతోమందికి ప్రధాన ఉపాధి మార్గంగా అవతరించింది. డిజిటల్ మీడియా సంఘంలో ఏదో పది పెద్ద సంస్థలు సభ్యులుగా చేరి నిర్ణయాలు తీసుకుంటే సరిపోదు. చిన్న, పెద్ద అందరికీ వర్తించేలా ఆదాయం పెరిగేలా గుర్తింపు, రక్షణ కలిగేలా వీరంతా వ్యవహరించాలి. మీడియా సంస్థలు, టెక్ కంపెనీలు, ప్రభుత్వాలు అందరూ కలిసి నిర్ణయాలు తీసుకోవాలి. మార్కెట్‌పరంగా చూస్తే డిజిటల్ మీడియా షేర్ రోజు రోజుకు పెరుగుతోంది. డిజిటల్ మీడియా అన్ని ముఖాల్లోనూ సర్వశక్తివంతం అయ్యే రోజుల కోసం ఆశాభావంతో ఎదురు చూద్దాం.

**(ఆంధ్రపత్రిక సౌజన్యంతో)**

# అనంతపురంలో నియోజకవర్గ కమిటీల ఏర్పాటు

అనంతపురంజిల్లా అర్బన్ నియోజకవర్గంలో ఫెడరేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షఫీ,ఆర్.రామాంజనేయులు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. త్వరలో జిల్లా మహాసభ నిర్వహించాల్సి ఉన్నదని వారు జర్నలిస్టులను సంసిద్ధం చేశారు.

పెనుగొండలో

శ్రీ సత్య సాయి జిల్లా పెనుగొండ నియోజకవర్గం ఫెడరేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అతిథులుగా అనంతపురం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షఫీ, ఆర్.రామాంజనేయులు హాజరయ్యారు. వారి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల్లో కమిటీల ఏర్పాటుకు అందరూ సమష్టిగా కలిసి పనిచేయాలని కోరారు.







## జర్నలిస్టుల బస్సు పాస్‌లపై కీలక ఆదేశాలు

జర్నలిస్టుల బస్సు పాస్‌ల అనుమతిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర కార్యాలయం ఆదేశాల ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన (గుంటూరు, పల్నాడు, బాపట్ల) జర్నలిస్టుల 'జిల్లా పాస్‌ల'ను సూపర్ లగ్జరీ బస్సుల వరకు ఉచితంగా అనుమతిస్తారు. పల్నాడు జిల్లా జర్నలిస్టుల జిల్లా పాస్‌లను విజయవాడ వరకు కూడా ఉచితంగా అనుమతిస్తారు. ఈ విషయాలను నోటీసు బోర్డులు, గేట్ మీటింగ్‌ల ద్వారా సిబ్బంది అందరికీ తెలియజేయాలని పల్నాడు జిల్లా రవాణాధికారి కార్యాలయం జారీ చేసిన నోటీసులో పేర్కొంది.



## జర్నలిస్టు సుభాని మృతి


గుంటూరు జిల్లా క్రోసూరు మండలంలో సీనియర్ జర్నలిస్టుగా పనిచేస్తున్న షేక్ సుభాని మే 23వ తేదీ మృతి చెందారు. గత ఇరవై అయిదు సంవత్సరాలుగా విలేకరిగా పనిచేస్తున్న సుభాని గురించి ఈ ప్రాంతంలో తెలియనివారు లేరు. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే స్థానిక విలేకరులు ఆయన ఇంటికి చేరుకుని నివాళులు అర్పించారు. షేక్ సుభాని మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పట్నాల సాయికుమార్, వి.మహేష్‌లు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరు



జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాయలసీమ జిల్లాల ఇన్చార్జ్ కవరకుంట్ల జయరాజ్ తెలిపారు. మదనపల్లె పట్టణంలోని ఎస్.టి.యు కార్యాలయంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు రమేష్ రాయల్ అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభానికి ముందు అమరులైన విలేకరుల కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఇంటి స్థలాలు, మీడియా కమిషన్ ఏర్పాటు, పెన్షన్ సౌకర్యం, జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య వంటి హక్కుల సాధనకు ఏపీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని ఆయన అన్నారు. జర్నలిస్టుల సహకారంతో మార్చి 4న జరిగిన చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం అయిందని తెలిపారు. వేలాదిమంది జర్నలిస్టులు విజయవాడ నగరం వీధుల్లో హక్కుల సాధనకు గళమెత్తారని వివరించారు. చలో విజయవాడ కార్యక్రమానికి హాజరైన సమాచార శాఖ మంత్రి పార్థసారథి జర్నలిస్టుల సమస్యలపై సానుకూలంగా స్పందించారని వివరించారు. త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు వివరించారు. సంస్థాగతంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ ను బలోపేతం చేసేందుకు స్థానిక నాయకత్వం కృషి చేయాలని వివరించారు. అనంతరం జూన్ 7న పీలేరు పట్టణంలో అన్నమయ్య జిల్లా మొదటి మహాసభ నిర్వహిస్తున్నట్లు సమావేశం తీర్మానించింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా మంత్రులు, శాసనసభ్యులు, ప్రతిపక్ష నేతలను ఆహ్వానించాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు రమేష్ రాయల్, హిదాహితుల్లాఏఅప్ప, ఏపిబిజిఏ అధ్యక్ష కార్యదర్శులు రెడ్డి ప్రసాద్, రమేష్ బాబు అక్రిడేషన్ కమిటీ సభ్యులు జాకీర్, మంజునాథ్, రాజు, శ్రీనివాసులు, కటారి రామయ్య, గిరి, గిరి శేఖర్, ఆంధ్రప్రభ శీను, అస్లాం, నజీర్ సాహెబ్, బాలాజి, గురు ప్రసాద్, భానుకిరణ్, రవి తదితరులు పాల్గొన్నారు.





## జర్నలిస్ట్ సీతాపతి మృతి

గుంటూరు జిల్లా నగరం మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఎల్లాప్రగడ సీతాపతి (76) ఆకస్మికంగా మృతి చెందారు. సీతాపతి పలు దినపత్రికల్లో విలేకరిగా పనిచేసి ప్రజల మన్ననలు పొందారు. ఉపాధ్యాయ వృత్తిలో చేసిన సేవలు మరువలేనివి. ఆయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ గుంటూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి సాయికుమార్, మహేష్‌లు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.



# మణిబాబు మరణం ఫెడరేషన్‌కు తీరనిలోటు

ఏపీడబ్ల్యూజేఎఫ్ నగర సహాయ కార్యదర్శి మణిబాబు మరణం సంఘానికి తీరనిలోటు అని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.గోరంట్లప్ప, చంద్రయ్య, ఏపీబీజేఏ జిల్లా అధ్యక్షుడు టీజీ ప్రసాదు, నగర అధ్యక్షుడు ఎం.శివశంకర్ పేర్కొన్నారు. కలెక్టరేట్లోని మీడియా రూంలో మణిబాబు సంస్మరణ సభను నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు కాళ్లు లేకపోయినా సంఘంలో ఎంతో చురుగ్గా ఉండే మణిబాబు గుండెపోటును మరణించడం బాధాకరమన్నారు. ఆయన సరిగ్గా పత్రిక స్వేచ్ఛ దినమైన మే 3వ తేదీన మరణించారని, ఆయన మరణం కూడా పత్రిక స్వేచ్ఛకు ముడిపడడం గర్వించదగ్గ విషయమన్నారు. మణిబాబు కుటుంబాన్ని అముకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్తుల సంక్షేమంపై దృష్టి సారించాలన్నారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులు మరణిస్తే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఆలాగే 58 ఏళ్లు నిండిన జర్నలిస్టులకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ఎర్రమల. ఎస్టీవీ స్టాఫ్ రిపోర్టర్ చంద్రశేఖర్, ఉత్తేజిత పత్రిక ఎడిటర్ చంద్రశేఖర్, సీనియర్ నాయకులు చంద్రమోహన్, కె.జమ్మన్న, రఫీక్, వరకుమార్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో జర్నలిస్టుల సొంత ఇంటి కల నెరవేర్చండి

రాష్ట్రంలో జర్నలిస్టుల సొంత ఇంటి కల నెరవేర్చాలని, కూటమి ప్రభుత్వం ఆ దిశగా కృషి చేయాలని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణలు కోరారు. విశాఖపట్నంలోని అక్కయ్యపాలెం జంక్షన్‌లోని ప్రైవేట్ హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్, ఏపీ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. గతంలో రెండు ప్రభుత్వాలు జర్నలిస్టుల నుంచి ఆన్ లైన్‌లో దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. అయినప్పటికీ వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయింపు జరగలేదన్నారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథితో పాటు కూటమి ముఖ్య నేతలకు వినతులను అందజేసి పరిస్థితులను తెలియజేశామన్నారు. వర్కింగ్ జర్నలిస్టులకు ప్రమాద బీమా పాలసీని పునరుద్ధరించాలన్నారు. విశాఖ జిల్లా వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముగిసిందన్నారు.. 800 మంది జర్నలిస్టులు తమ యూనియన్‌లో సభ్యత్వ నమోదు చేయించుకున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా కార్యదర్శి జి శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ధవలేశ్వరపు రవికుమార్, ఉపాధ్యక్షులు పి నగేష్ బాబు, బ్రాడ్ కాస్ట్ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, కార్యదర్శి కింతాడ మదన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్, కార్యదర్శి కే శ్రీనివాసరావు, సంఘ ప్రతినిధులు బొబ్బర ప్రసాద్, హరి, కోశాధికారి కేవీ శర్మ, గణేష్ పాల్గొన్నారు.

**రవికుమార్ మృతికి నివాళి**

ఎన్ఏడి ప్రాంతానికి చెందిన జర్నలిస్టు పి.రవికుమార్ మృతి పట్ల వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. రవికుమార్ మృతికి మౌనం పాటించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

# మానవీయ దృక్పథ రచనల్లో మేటి తాడి ప్రకాష్



మానవీయకోణంలో రచనలు చేస్తూ తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న రచయితగా తాడి ప్రకాష్ నిలిచారని ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. ఆచార్య చందు సుబ్బారావు లిటరరీ, కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశాఖ పౌర గ్రంథాలయంలో చందు సుబ్బారావు సాహిత్య పురస్కార సభ 2026 ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు, రచయిత తాడి ప్రకాష్‌కు చందు సాహిత్య పురస్కారాన్ని అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రకాష్ రచనల్లో సమాజంపై ఉన్న ఆవేదన, మానవీయ స్పృహ స్పష్టంగా కనిపిస్తాయని తెలిపారు. జర్నలిజంలో కొత్త పద ప్రయోగాలకు ఆయన ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ప్రపంచ విప్లవకారులు చేగువేరా హత్యకు సంబంధించిన నిజాలను వెలుగులోకి తీసుకొచ్చిన జర్నలిస్టును తెలుగువారికి పరిచయం చేసిన వారిలో తాడి ప్రకాష్ ఒకరని గుర్తు చేశారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న విశాఖ కోఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ జేవి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజల పోరాట స్ఫూర్తి ఆధునిక సాహిత్యానికి పునాది అయిందన్నారు. సమానత్వ సమాజం కోసం కృషి చేసే వారే కమ్యూనిస్టులని, మార్క్సిజాన్ని అర్థం చేసుకున్నప్పుడే సమాజ ఆర్థిక పరిస్థితులపై స్పష్టత వస్తుందని అభిప్రాయపడ్డారు. సభకు అధ్యక్షత వహించిన యుపిఎస్సి మాజీ సభ్యులు ఆచార్య కేఎస్ చలం మాట్లాడుతూ ఆధునిక సాహిత్యాన్ని, సమకాలీన పరిస్థితులకు అన్వయించుకొని చదవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రముఖ రచయిత జి.ఎస్ చలం తాడి ప్రకాష్ రచన ప్రతిభను ఉదాహరణలతో వివరిస్తూ పరిచయం చేశారు. లీడర్ పత్రిక సంపాదకులు వివి రమణమూర్తి మాట్లాడుతూ నేటి జర్నలిస్టులకు సాహిత్యం చరిత్రపై అవగాహన తగ్గిపోవడం వల్ల వార్తలు లోతు తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కవి సంధ్య సంపాదకులు కళారత్న డాక్టర్ శిఖామణి చందు సుబ్బారావుపై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, బసు పోతన తదితరులు పాల్గొన్నారు.

# మీడియా సంయమనం పాటించాలి

దేశవ్యాప్తంగా సంచలనం రేపిన త్విషా శర్మ మృతి పట్ల చాలా బాధాకరంగా ఉన్నట్టు సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అయితే ఈ కేసులో మీడియా సంయమనంతో వ్యవహరించాలని కోర్టు సూచించింది. మాజీ మోడల్ త్విషా శర్మ మృతి కేసులో జరుగుతున్న పరిణామాలను వార్తలు రాసే సమయంలో మీడియా ఓపికతో వ్యవహరించాలని కోరింది. భోపాల్‌లోని కటారా హిల్స్‌లో అత్తారింట్లో ఉన్న త్విషా శర్మ మే 12న ఉరివేసుకుంది. వరకట్న వేధింపులు, ఆత్మహత్యకు ప్రేరేపించడం వల్లే త్విషా మరణించినట్లు కుటుంబసభ్యులు ఆరోపించారు. ఆమె భర్త సమర్థసింగ్ లాయర్‌గా పనిచేస్తున్నారు. అత్త గిరిబాలాసింగ్ మాజీ జడ్జి. అయితే పోలీసులు వారిద్దరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. త్విషా కేసులో దర్యాప్తు నిష్పక్షపాతంగా జరుగుతుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. కొన్ని చర్యలు చాలా బాధాకరంగా ఉన్నాయని, బాధిత కుటుంబం గానీ, ఇతర వ్యక్తుల వాంగ్మూలం అంశంలోనూ మీడియా సంయమనంతో వ్యవహరించాలని కోర్టు స్పష్టం చేసింది. చట్టం ప్రకారం విచారణ జరుగుతుందన్నారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. ఇలాంటి దురదృష్ట పరిస్థితిని ఎదుర్కొనడం కన్నా విడాకులు తీసుకున్న కూతురు ఉన్నా మెరుగేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కేసును త్వరలో సిబిఐ విచారణకు చేపట్టేందుకు చర్యలు తీసుకోబోతున్నట్టు ఆయన చెప్పారు.

# ప్రపంచ పత్రిక స్వేచ్ఛ సూచికలో దిగజారుతున్న భారత్

భారత్‌లో పత్రిక స్వేచ్ఛపై కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ప్రపంచ పత్రిక స్వేచ్ఛ సూచిక 2026లో భారత్ 157 స్థానంలో ఉందని ఇది చాలా తీవ్రమైన అంశం అని కాంగ్రెస్‌పార్టీ పేర్కొంది. ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా భారత్ పత్రిక స్వేచ్ఛ పరిస్థితిపై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. స్వేచ్ఛాయుత పత్రిక ప్రజాస్వామ్యానికి గొంతుక అని అయితే అది దాడికి గురవుతుందని కాంగ్రెస్ ఆరోపించింది. అలాగే అధికారానికి నిజాన్ని చెప్పే ప్రజాస్వామ్యం పరీక్షించడానికి పరిరక్షించడానికి కృషి చేసే పాత్రికేయులకు, గొంతుకలకు సంఘీభావం తెలిపింది.

స్వేచ్ఛాయుత పత్రిక వ్యవస్థ ప్రజాస్వామ్యానికి గొంతుక. కానీ నేడు ఆ గొంతుక పైనే దాడి జరుగుతోంది. ప్రపంచ పత్రిక స్వేచ్ఛ సూచిక 2026లో భారత్ 157వ స్థానంలో నిలిచింది. ఇది అత్యంత తీవ్రమైన వర్గంలోకి వస్తుంది. ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా అధికారానికి నిజాన్ని చెబుతూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి పోరాడే ప్రతి నిర్భయ గొంతుకకు కాంగ్రెస్ పార్టీ దృఢంగా అండగా నిలుస్తుంది అని కాంగ్రెస్ అభిప్రాయం వ్యక్తం చేసింది.

మరోవైపు మీడియా స్వేచ్ఛ అంశంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బిజెపిపై తీవ్ర విమర్శలు చేశారు. స్వతంత్ర మీడియాను శిక్షిస్తామని, విధేయతకు ప్రతిఫలం దక్కుతుందని స్పష్టమైన సందేశం ఇస్తున్నాయని ధ్వజమెత్తారు. మీడియాలోని కొన్ని వర్గాలు అధికార పార్టీకి వత్తాసు పలకడానికి పనిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రపంచ మీడియా స్వేచ్ఛ దినోత్సవాన్ని పురస్కరించుకొని కలిగే ఎక్స్‌లో ఒక పోస్ట్ పెట్టారు ప్రపంచ మీడియా స్వేచ్ఛ సూచిలో భారత స్థానం 2014 నుంచి తగ్గుతూ వస్తుందన్నారు. బిజెపి హయాంలో ప్రపంచ మీడియా స్వేచ్ఛ సూచిలో భారత్ స్థానం తగ్గుతూ 157కు పడిపోయిందన్నారు. ఈ కఠోర సత్యాన్ని ఎదుర్కొనాల్సి ఉందన్నారు. మీడియా గొంతు నొక్కేందుకు రాజ్యాంగ సంస్థలను ఆయుధాలుగా వాడుకోవడం పెరిగిందని ఖర్గే విమర్శించారు. మీడియా స్వేచ్ఛ అంటే ప్రభుత్వ వాదనను ఎక్కువగా వినిపించి దాని వైఫల్యాలను కప్పిపుచడం కాదన్నారు. పాలకవర్గాన్ని ప్రశ్నించటం, వారు చేసే పనులను పరిశీలించి జవాబుదారీ చేయడమే నిజమైన మీడియా స్వేచ్ఛ అని ఎక్స్ పోస్టులో ఖర్గే పేర్కొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 180 దేశాల్లో చేపట్టిన సర్వేలో భారత్ 157వ స్థానంలో నిలిచింది. కాగా గతేడాది విడుదల చేసిన జాబితాలో భారత్ 151 వ స్థానంలో నిలవగా, ఈ ఏడాది మరో ఆరు స్థానాలు దిగజారింది. ఈసారి జాబితాలో తొలి స్థానంలో నార్వే ఆ తర్వాత నెదర్లాండ్, ఎస్తోనియా, డెన్మార్క్, స్వీడన్ దేశాలు ఉన్నాయి. ఇక చివరిలో సౌదీ అరేబియా, ఇరాన్, చైనా, ఉత్తర కొరియాలు ఉన్నాయి. ప్రపంచ దేశాల్లో జర్నలిస్టులు మీడియాకు ఉన్న భావ ప్రకటన స్వేచ్ఛ ఆధారంగా ఫ్రాన్స్ కేంద్రంగా పనిచేసే రిపోర్టర్స్ విత్‌ౌట్ బోర్డర్స్ అనే సంస్థ ఏటా వరల్డ్ ప్రెస్ చేయడం ఇండెక్స్‌ను విడుదల చేస్తోంది. పత్రికా స్వేచ్ఛ పట్ల తమ నిబద్ధతను గౌరవించాల్సిన అవసరాన్ని ప్రభుత్వాలకు గుర్తు చేస్తూ మే మూడున వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ డే ను నిర్వహిస్తున్నారు.. ఇది పత్రిక స్వేచ్ఛ వృత్తిపరమైన నైతిక విలువలకు సంబంధించిన అంశాలపై మీడియా నిపుణులు ఆత్మపరిశీలన చేసుకునేలా చేస్తుంది. పత్రికా స్వేచ్ఛ ప్రాథమిక సూత్రాల అమలు ప్రపంచవ్యాప్తంగా పత్రిక స్వేచ్ఛ స్థితిని అంచనా వేయడానికి మీడియా స్వాతంత్ర్యపై జరుగుతున్న దాడుల నుంచి రక్షించడానికి, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పాత్రికేయులకు నివాళులు అర్పిస్తారు.

1991 ఏప్రిల్ 29 నుంచి మే 3 వరకు నమీబియా రాజధాని విన్‌హోవ్‌లో ఆఫ్రికాలో పత్రికా స్వేచ్ఛ స్వతంత్రం అనే అంశంపై యునెస్కో సెమినార్ నిర్వహించింది. మే 3న పత్రికల స్వేచ్ఛ కోసం కొన్ని సూత్రాలను ప్రతిపాదించగా దాన్నే విండ్‌హోక్ డిక్లరేషన్‌గా పేర్కొంటారు. దీనికి గుర్తుగా ప్రపంచవ్యాప్తంగా ఏటా మే మూడున ప్రపంచ పత్రిక దినోత్సవంగా జరుపుకోవాలని 1993 డిసెంబర్‌లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తీర్మానించింది. 1994 నుంచి ఏటా నిర్వహిస్తున్నారు. ఈ విండ్‌హోక్ ప్రకటన ప్రపంచవ్యాప్తంగా పత్రిక స్వేచ్ఛను నిర్ధారించడానికి ఒక మైలురాయిగా నిలుస్తుంది. ఇది ఆఫ్రికన్ పాత్రికేయులు మీడియా నిపుణుల మధ్య జరిగిన భావాల మార్పిడి, ఆఫ్రికాతో పాటు ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో పత్రికాస్వేచ్ఛ, స్వతంత్రత, బహుళత్వాలను పెంపొందించడానికి కృషి చేస్తుంది.

**పత్రికా స్వేచ్ఛ అంటే....**

సమాచారం, జ్ఞానం, ఆలోచనలు భావాల వ్యాప్తిపై చట్టబద్ధమైన, పాలనాపరమైన నియంత్రణ లేకపోవడమే పత్రిక స్వేచ్ఛ. అంటే మీడియా సంస్థలు, ప్రభుత్వం లేదా బయట వ్యక్తుల నుంచి అనవసరమైన జోక్యం లేదా సెన్సార్‌షిప్ లేకుండా వార్తలు ప్రచురించడానికి అభిప్రాయాలు వ్యక్తం చేయడానికి సమాచారాన్ని వ్యాప్తి చేయడానికి ఉండే పత్రిక స్వేచ్ఛగా చెబుతారు.

# అ'నిర్ధారిత' భాష

దేశ యువకులను, సమాచార హక్కు కార్యకర్తలను 'బొద్దింకలు పరాన్న జీవులు' అని అభివర్ణించారు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి. మరుసటి రోజు ఆయన వివరణ ఇచ్చినప్పటికీ ఆయన మాటలు జనం మదిలోంచి చెరిగిపోయే అవకాశం లేదు. అంతటి అత్యున్నత న్యాయ పీఠంపై ఉన్న వ్యక్తి నుంచి ఇలాంటి చౌకబారు మాటలు అసలు ఊహించలేం. ఆ వివరీత వ్యాఖ్యలను శుక్రవారం సుప్రీంకోర్టు మౌనసాక్షంగా నిలిచింది. దేశ భవిష్యత్తుకు వెన్నెముకగా నిలిచే యువతను వారి హక్కుల కోసం పోరాడే శక్తులను అత్యున్నత పీఠాలపై కూర్చున్న వారు చూసే విధానానికి ఈ మధ్యకాలంలో వస్తున్న ఇలాంటి వ్యాఖ్యలే నిదర్శనం. ఒక న్యాయవాది తనకు సీనియర్ న్యాయవాదిగా గుర్తింపు ఇవ్వకపోవడాన్ని ప్రశ్నిస్తూ దాఖలు చేసిన పిటిషన్ ప్రస్తావనకు వచ్చినప్పుడు సిజెఐ వ్యవస్థ మీద నోరు పారేసుకున్నారు.

''ఏ ఉద్యోగము దొరకని బొద్దింకల్లాంటి యువకులు ఉన్నారు. వీరిలో కొందరు మీడియాలో దూరతారు, కొంతమంది సామాజిక మాధ్యమాలలో ఏవో రాస్తుంటారు. కొందరు సమాచార హక్కు కార్యకర్తల అవతారం ఎత్తుతారు. వారు అందర్నీ తప్పు పడుతుంటారు'' అని ప్రశ్నించే వారందరినీ బొద్దింకలు అనేశారు. ప్రజాస్వామ్యానికి రక్షణ కోసం ఉండాల్సిన న్యాయవ్యవస్థ ఉన్నత పీఠాలపై కూర్చున్న కొందరు వ్యక్తులు పెట్టుబడిదారీ వర్గాల భాషను చూడల అహంకారాన్ని ప్రదర్శించడం దేశంలో పెరుగుతున్న సామాజిక అసమానతలకు, అణిచివేత ధోరణికి అర్థం పడుతుంది. మీరు ఉపయోగించే భాష, చేసే వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగత అభిప్రాయాలుగా మిగిలిపోవు అవి సమాజంపై ముఖ్యంగా దేశ భవిష్యత్తును నిర్ణయించే యువతరంపై తీవ్ర ప్రభావం చూపుతాయి.

చారిత్రకంగా శ్రామిక వర్గం, విద్యార్థి లోకం, యువత సాగించే పోరాటాలను అణిచివేయడానికి పాలకవర్గాలు ఎప్పుడూ ఒక నిర్ధారితమైన భాషను అణిచివేత ధోరణిని ఉపయోగిస్తూనే ఉంటాయి. నేడు దేశంలో నిరుద్యోగం రికార్డు స్థాయికి చేరింది. చదువుకున్న యువతకు ఉపాధి లేదు. కార్మిక చట్టాలు నీరుగారి పోతున్నాయి. విద్యావ్యవస్థ వ్యాపారీకరణ చెందుతోంది. ఇలాంటి సంక్షోభ సమయాల్లో యువత వీధుల్లోకి వచ్చి తమ హక్కుల కోసం, ఉపాధి కోసం, ప్రజాస్వామ్య రక్షణ కోసం గొంతెత్తుతోంది. యువత ఎదుర్కొంటున్న ఆర్థిక సామాజిక సంక్షోభాలకు పరిష్కారం చూపాల్సింది పోయి వారి ఆవేదనలను, నిరసనలను క్రమశిక్షణారాహిత్యంగా ప్రధాన న్యాయమూర్తి చిత్రీకరించడం ఎంత శోచనీయం! సమాజంలో వ్యవస్థను ప్రశ్నించే వారిని అమానవీయమైన పదాలతో సంబోధించడం అనేది ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం.

భారత ప్రజలకు సమాచార హక్కు అనేది పార్లమెంటు ఉదారంగా ఇచ్చిన వరం కాదు. ఇది రాజ్యాంగం కల్పించిన భరోసా అని సుప్రీంకోర్టు గతంలో చరిత్రాత్మకమైన తీర్పులు వెలువరించింది. కానీ నేడు రాజ్యాంగాన్ని గౌరవిస్తూ చట్టాన్ని అమలు చేయాల్సిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమాచార హక్కు కార్యకర్తలపై వ్యాఖ్యలు చేయడానికి ఏమనాలి? ఈ వాస్తవిక పరిస్థితుల్లో సమాచార హక్కు నీరు గారి పోతోందా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి.

పౌరుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే హక్కు ఏ వ్యవస్థకు లేదు. కోర్టుల్లో ప్రజాస్వామిక విలువలు, కార్మిక, శ్రామిక వర్గాల పట్ల గౌరవం పెంపొందేలా తగిన సంస్కరణలు చేపట్టాలి. అహంకారపూరిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. భారత న్యాయవ్యవస్థ తక్షణమే ఈ ఫ్యూడల్ మనస్తత్వం నుంచి బయటపడాలి. న్యాయమూర్తులు తాము పాలకులం కాదని రాజ్యాంగానికి లోబడి పని చేసే సేవకులమని గుర్తించాలి. వ్యవస్థలో లోపాలు ఉన్నప్పుడు వాటిని సరిదిద్దడానికి విమర్శలు అవసరమే కావచ్చు. కానీ ఆ విమర్శ యువతను సన్మార్గంలో పెట్టేలా వారిని ప్రోత్సహించేలా ఉండాలి కానీ వారి ఆత్మ గౌరవాన్ని సామాజిక స్పృహలను దెబ్బతీసేలా ఉండకూడదు.

యువతరం తమ హక్కుల కోసం పోరాడుతున్నప్పుడు వారిని అభినందించాల్సింది పోయి అవమానించటం అంటే వ్యవస్థ తన సొంత భవిష్యత్తును తానే తిరస్కరించుకోవడమే. న్యాయవ్యవస్థ అయినా కార్యనిర్వహక వ్యవస్థ అయినా రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను సమానత్వాన్ని కాపాడాలి. యువతను కించపరిచే విధంగా వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీసే విధంగా సాగే ఎలాంటి వ్యాఖ్యలైన ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వంటివి.


యువతరం అనేది ఒక దేశానికి కేవలం జనాభా మాత్రమే కాదు. అది ఆ దేశ ప్రగతి ప్రగతికి చోదక శక్తి. ఈ సమాజాన్ని నడిపించే చైతన్య రథసారథులు. చరిత్రలో ఏ విప్లవమైన మార్పైనా యువతరం త్యాగాలు, పోరాటాల ద్వారానే సాధ్యపడింది. పాలకుల, ఉన్నతాధికారుల అహంకారపూరిత వ్యాఖ్యలు యువత చైతన్యాన్ని ఆపలేవు. ఇప్పటికైనా పాలకవర్గాలు తమ శైలిని మార్చుకొని, యువతకు కావలసిన ఉపాధి, హక్కులు, గౌరవాన్ని అందించడంపై దృష్టి పెట్టాలి. యువతను కేవలం ఒక సమస్యగా చూడడం మానేసి వారిని దేశ నిర్మాణంలో భాగస్వాములను చేయడమే నేటి అవసరం. అత్యున్నత స్థానాల్లో ఉన్నవారు యువత ఆవేదనను వారి నిరసనల్లోని న్యాయాన్ని అర్థం చేసుకొని మరింత సమయమనంతో గౌరవప్రదమైన భాషతో సంబోధించినప్పుడే ప్రజాస్వామ్య విలువలు కాపాడబడతాయి. యువతను కించపరిచేలా సాగే ఎలాంటి వ్యాఖ్యలైన ఆధునిక ప్రజాస్వామ్య సమాజంలో ఎంత మాత్రం సమర్ధనీయం కావు.

**(నవతెలంగాణ సంపాదకీయం)**

# ఒక్కరు చాలు

## రఘురాయ్ : అజరామర ఛాయాగ్రాహకుడు

కందుకూరి రమేష్ బాబు
9948077893




మీకు తెలుసు. మనదేశాన్ని, ఇక్కడి జీవితాన్ని హృద్యంగా మానవీయ సంగీతఝరిగా ప్రపంచానికి చేరవేసిన అసాధారణ సినీ దర్శకులు సత్యజిత్ రే అని. ఛాయాగ్రహణంలో అలాంటి పనే మరింత విస్తరంగా చేసిన అపురూప ఫోటోగ్రాఫర్ రఘురాయ్. వారి మాదిరి ఈ దేశాన్ని వివిధాలుగా ఛాయాభరితం చేసిన ఫోటోగ్రాఫర్ మరొకరు లేరు. వారు గత నెల 26న మనల్ని వీడి వెళ్ళినప్పటికీ తాను వదిలిన సారస్వతం దర్శిస్తే చాలు, అది చరిత్రగా ఈ దేశం ఏమిటీ, అందులో సామాన్య జన జీవనం ఎలాంటిదో మనకే కాదు, ప్రపంచానికీ చిత్ర సహితంగా భోదపరుస్తుంది. అందుకే అనడం, వారు ఒక్కరు చాలని. భారతాన్ని భావితరాలు చదవడానికి ఆయన చేసిన మేలైన కృషితో వారి జన్మ ధన్యమైంది అనడానికి. మరి, సంక్షిప్తంగా నైనా రఘురాయ్ ఏం చేశారో ఇక్కడ చదవడం ఒక ఆత్మీయ నివాళియే.

రఘురాయ్ దేశ విభజనకు ముందు అవిభాజ్య భారతంలో పుట్టారు. దేశ విభజన తర్వాత భారతదేశాన్ని తన మాతృభూమిగా చేసుకున్నారు. నిజానికి ముందుగా ఒక సామాన్య ఇంజనీర్. అటు పిమ్మటే మనకు తెలిసిన గొప్ప ఫోటోగ్రాఫర్.

నమ్మరు గానీ వారి అసలు పేరు రఘునాథ్ చౌదరి. పంజాబ్ లో తాను ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అప్పట్లో గోవా యుద్ధసమయంలో ఆర్మీ వాళ్లకు యుద్ధ మ్యాపులు రూపొందించేందుకు గాను డ్రాఫ్ట్ మన్ గా విధుల్లో చేరారు. తాను పని చేసింది ఏడాదే అయినా ఒక నిపుణుడైన డ్రాఫ్ట్ మన్ గా ఆయన పనితీరు అప్పటికే ప్రసంశనీయం. ఏడాది తర్వాత ఇండియన్ ఎక్స్ ప్రెస్ లో ఫోటోగ్రాఫర్ గా పనిచేస్తున్న తన అన్నయ్య పాల్ వద్ద విశ్రాంతి తీసుకుందామని వచ్చి, తానూ అవిశ్రాంత పొటో గ్రాఫరే అయ్యారు. అది యాధృచ్ఛికం. కానీ, ఈ దేశానికి ఒక కానుకే అయింది.

అవును. అన్నయ్య ఇచ్చిన ఒక చిన్న కెమెరా తీసుకుని ఒక గాడిద పిల్లను నిలువుగా యోగిలా మొదటి ఫొటో తీశారు. అది న్యూయార్క్ టైమ్స్ లో అచ్చువడమే గాక పారితోషకం లభించడం, గ్రీటింగ్ కార్డ్ పై ముద్రితమవడంతో ఫొటోగ్రఫీనే తన ఇష్ట మాధ్యమంగా ఎంచుకున్నారు. దాన్నే జీవితం చేసుకున్నారు. చిత్రమేమిటంటే ఆయన స్టేట్స్ మన్ పత్రికలో ఫోటోగ్రాఫర్ గా చేరేటప్పుడు తన పేరును రఘురాయ్ గా మార్చుకున్నారు. ఎందుకూ అంటే "జస్ట్ రైం కోసం" అన్నారు.



అది నిజంగానే క్లిక్ అయింది.

క్లిక్ అవడమే కాదు, అట్లా రఘునాథ్ చౌదరి అన్న 23 ఎళ్ళ యువకుడు ఫోటోగ్రాఫర్ గా తన వృత్తి జీవితం ప్రారంభించిన నాటి నుంచి



గత నెల తన 83 ఏట మరణించేదాకా సరిగ్గా ఆరు దశాబ్దాల పాటు చూపుడువేలుతో 'క్లిక్' చేయడమే తన ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా బ్రతికడం అసాధారణమే. వారు పూర్తికాలం లెన్స్ మన్ గా ఈ దేశకాలమాన పరిస్థితులను అసాధారణంగా చిత్రికపట్టి వేలాది కళా ఖండాలను వదిలి వెళ్లారు. ప్రపంచంలో మరే ఫోటోగ్రాఫర్ తేనన్ని పుస్తకాలు, యాభైకి పైగా పుస్తకాలుగా సంపుటీకరించి ఆయన తన కృషిని అపార నిధిగా అందించి వెళ్ళారు. వీటన్నిటిని చూస్తే, ఒక ముద్దుబిడ్డగా ఆయన భరతమాత మేడలో ఛాయాచిత్రాలతోనే వివిధ్యమైన పూలతో ఒక పరిమళభరిత మాలను అల్లి, ఎంతో ఆదరంతో వినమ్రంగా అర్పించినట్లు అర్థమవుతుంది.

కెమెరా పట్టుకున్నది మొదలు ఆయన మూడు విధాలుగా పనిచేశారు. ఒకటి, పత్రికల్లో పనిచేయడం. రెండవది, మ్యాగ్నం ఫోటో ఏజెన్సీ కి అసోసియేట్ ఫొటోగ్రాఫర్ గా పని చేయడం. మూడు, స్వతంత్ర ఫొటోగ్రాఫర్ గా పని చేయడం. ఒకటి, రెండు కాదు, ఆరు దశాబ్దాలుగా ఆయన అవిశ్రాంతంగా పని చేశారు. మన దేశంలో ఫోటోగ్రఫీకి సంబంధించినంత వరకు రఘురాయ్ అన్న పేరు ఈ దేశ నాలుగో స్థంభం అనదగ్గ పత్రికా ప్రపంచంలో తిరుగులేని సిగ్నేచర్ గా మార్చిన ద్రష్ట ఆయన. మన దేశంలో సిగ్నేచర్ ఆర్ట్ గా పేరున్న చిత్రకళ మాదిరి ఫోటోగ్రఫీ కూడా లక్షలాది పాఠకులను ప్రత్యేకంగా ఆకర్షించడం మొదలైనదీ అంటే అది రఘురాయ్ తోనే.

1965లో స్టేట్స్ మన్ దిన పత్రికలో ఫోటోగ్రాఫర్ గా జీవితాన్ని ప్రారంభించిన రఘురాయ్ అందులో పదేళ్ళు పనిచేశారు. తర్వాత కోల్ కత్తా నుంచి ప్రచురితమైన సండే మ్యాగజైన్ కు పిక్చర్ ఎడిటర్ గా నాలుగేళ్ళు పనిచేశారు. అటు తర్వాత ఇండియా టుడే మ్యాగజైన్ పిక్చర్ ఎడిటర్ గా బాధ్యతలు తీసుకుని మరో పదేళ్ళు పనిచేశారు. అంటే మొత్తం ఇరవై ఐదేళ్ళు వేర్వేరు పత్రికల్లో పని చేస్తూ ఆయన అనేక ప్రయోగాలు చేశారు. సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లోని అనేక అంశాలను చిత్రించి పత్రికా జర్నలిజంలో ఫోటోగ్రఫీకి పెద్దపీట వేశారు.

మీరూ చూడలేదని కాదు, పత్రికల్లో ఆరు కాలమ్ ల ఫోటోలు తరచూ ప్రచురితం అయ్యాయీ అంటే అది రఘురాయ్ చలువే. సామాన్య భారతం, అందలి మామూలు జీవన ఛాయలు మొదటి పేజీల్లో ప్రాధాన్యత పొందాయీ అంటే అది కూడా రఘురాయ్ చొరవే. అంతేకాదు, కుంభమేళ వంటి ఆధ్యాత్మిక ఉత్సవాల పట్ల పాఠకుల్లో అవగాహన పెరిగిందీ అంటే కూడా ఆయన వల్లే అంటే అతిశయోక్తి కాదు.

పత్రికల్లో ఫోటోలేకాదు, ఫొటో వ్యాసాలకూ ఆయన విలువను పెంచారు. ఎన్నో ప్రత్యేక సంచికలు రూపొందించి జీవితాల్ని అనేకానేక అంశాలను



ఛాయచిత్రాల ద్వారా అపూర్వంగా వెలుగులోకి తేగలిగారు. పెళ్ళికాని బాల తల్లులు, పిచ్చివాళ్ళ ప్రపంచాన్నే కాదు, మన సంగీత విద్వాంసులుపై, మదర్ థెరీసా, దలైలామా, ఇందిరా గాంధీ, జయప్రకాష్ నారాయణ్ వంటి వారిపై ఆయన ఎన్నో ఛాయచిత్ర కథనాలు ప్రచురించారు. అక్షరానికి దృశ్యం జత చేయడమే కాదు, స్వయంగా ఛాయాచిత్రాలే కథనాన్ని చేబుతాయన్న నమ్మికనూ ఆయనే పెంచారు.

1990లో ఆయన ఇండియాటుడే నుంచి తప్పుకుంటూ ఒక మాట అన్నారు. పత్రికలూ, వివిధ ప్రచార ప్రసార మాధ్యమాలు సమాచారాన్ని ఇవ్వడం కంటే వినోదానికి ప్రాముఖ్యం ఇవ్వడాన్ని ఆయన 'ఇన్ఫోటెన్ మెంట్' అన్నారు. ''ఇది జీవితాన్ని యధాతదంగా చూపడానికి విరోధం. నా వంటి కళాకారుడు వాస్తవికతకు తగినంత స్పేస్ క్రియేట్ చేయడం కోసం ఫైట్ చేయడం కన్నా స్వతంత్రంగా భారతాన్ని ఉన్నదున్నట్లు చిత్రించేందుకు నడుం కట్టడమే మేలు" అన్నారు. ఉద్యోగం వదిలి అదే చేశారాయన. 1990 నుంచి మరణించే దాకా ఆయన ఎక్కడా ఉద్యోగిగా పనిచేయలేదు. స్వతంత్ర ఫోటోగ్రాఫర్ గా నిలదొక్కుకొని స్వేచ్ఛగా, ఒక ప్రయోగిగా, అన్వేషకుడిగా ఒక తపస్సుగా పని చేసి ఈ దేశం అంటే ఏమిటో ఎప్పటికప్పుడు చెప్పడంలోనే తలమునకలయ్యారు. ఆయనవలే డబ్బు, కీర్తి,


అవార్డులు, రివార్డులు కోసం కాకుండా, రాజకీయ ఒత్తిడులకు లోబడకుండా బాధ్యతాయుత ఫోటో జర్నలిస్ట్ గా తనను తాను నిలబెట్టుకుని పనిచేసిన ఫోటోగ్రాఫర్ మనదేశంలో మరొకరు లేరు.

తొలుత ఉద్యోగం, అనంతరం స్వతంత్ర వ్యాపకం, మధ్యంలో మరో చెప్పుకోదగిన అంశం మ్యాగ్నం ఫోటోగ్రాఫర్ గా సేవలు అందించడం. అవును. రఘురాయ్ 1976లోనే ప్రపంచ బ్రెస్సన్ పిలుపుతో ప్రసిద్ధి చెందిన మ్యాగ్నం ఫోటోగ్రఫీ స్వచ్ఛంద సంస్థలో అసోసియేట్ ఫోటోగ్రాఫర్ గా చేరి, విశ్వ విఖ్యాత ఫోటోగ్రాఫర్ల సరసన నిలిచి, తనదైన శైలిలో మన దేశాన్ని, ఇక్కడి జీవన వైవిధ్యాన్ని ప్రపంచ పౌరులకు తెలియజేస్తూ వచ్చారు. మన దేశంనుంచి మ్యాగ్నం ఏజెన్సీలో చేరాలని ఆహ్వానం అందుకున్న మొట్టమొదటి ఫోటోగ్రాఫర్ కూడా వారే.

ఇట్లా రఘురాయ్ ఆరు దశాబ్దాల సుదీర్ఘ ఛాయాగ్రహకుడిగా నిబద్ధతతో కృషి చేయడం భారతీయ ఫోటోగ్రఫీ చరిత్రలో ఘనమైన అధ్యాయం. లక్షలాది చిత్రాలు, వేలాది కథనాలు, వందలాది ప్రత్యేక సంచికలు, యాభైకి పైగా కాఫీ టేబుల్ బుక్స్ తో ఆయన విశిష్టమైన ఫోటోగ్రాఫర్ గా తనదైన ముద్ర వేయగలిగారు. ఇదంతా ఒక ఇంజనీర్ అనూహ్యంగా ఫోటోగ్రాఫర్ కావడం వల్ల జరిగిన ఫలితం.

ఆయనేం చేశారు అంటే నలుపు తెలుపుల్లో అత్యంత శక్తివంతంగా బంగ్లాదేశ్ యుద్ధ సమయంలో శరణార్థులను చిత్రించారు. దానికే ఆయన పద్మశ్రీ అందుకున్నారు. అలాగే భోపాల్ లో పసిపాప మృత్యు శీలతను గుండెలు చెమర్చేలా చిత్రించారు. నిజానికి భోపాల్ గ్యాస్ లేకేజీ వ్యవహారం కేవలం 'ట్రాజడీ' కాదు, అది 'కార్పొరేట్ క్రైం' అని సూటిగా పుస్తకం తెచ్చి మరీ ప్రశ్నించిన యోధుడాయన.

ఈ దేశం అంటే ప్రత్యేక పరిసరం అని, బహుళ జీవన లోకం అని, అందలి జీవశక్తిని, దాని ప్రవాహ సాదృశ్యాన్ని చిత్రసహితంగా దివ్య దర్శనంగా ప్రతిఫలించిన కవితుల్యులు ఆయన. స్త్రీలు, పురుషులు, దీనులు, సాధువులు, రాజకీయ నేతలు, శరణార్థులు, ఒకరని కాదు, సామాన్యులు, ప్రసిద్ధులు– అందరినీ అదే కంటితో అంతే శ్రద్ధతో అమిత ఆర్తితో ఆయన



చిత్రించారు. మనుషులు, పట్టణాలు, స్థలాలు, నదులు, నాగరీకతలు, ఆకులు, అలములు, మేఘాలు, మైదానాలు, శిల్పాలూ– అన్నిటినీ కాలగర్భంలో కలిసిపోకుండా చిత్రించి పదిలం చేశారు. అమృతసర్ టెంపుల్ నుంచి మన ఏడు కొండల వెంకన్న దాక, కుంభమేళ నుంచి మన ఏడుపాయల జాతర దాకా ఆయన ఈ దేశంలోని సకల జీవన పార్శ్వాలను ఎంత ఆదరంతో చిత్రించారూ అంటే ప్రతి చిత్రం తనకు ఒక సంపూర్ణమే. అట్లా, దేన్నీ వదలకుండా డిల్లీ, ముంబై, కోల్ కత్తా, వారణాసితో సహా– మానవీయతకే కాదు, ఈ దేశానికి మూలమైన ఆధ్యాత్మికతనూ వారు ఎంత గురుతర బాధ్యతతో చిత్రించారూ అంటే తన చిత్రమే తన జీవితం అన్న స్థాయిలో లీనమై పదిలపరిచారు. తప్పక చూడాలి. కావ్య స్థాయిలో తెచ్చిన వారి రచనల్లో వివిధ రుతువుల్లో తాజ్ మహల్ ప్రత్యేకమైంది. దాన్ని ఆయన చిత్రించి గ్రంథస్థం చేసిన విధానం తప్పనిసరిగా ఒక చూడ ముచ్చటైన నిదర్శనం.

ఎందరో మరణిస్తారు. వారి లోటు తెలుస్తుంది. కానీ, రఘురాయ్ అలా కాదు. వారు ఒక్కరు చాలు, తన ఒక్క జన్మ చాలు; ఈ దేశం చిరస్మరణీయంగా నిలిచే ఛాయలను అడుగు జాడలుగా వదిలి వెళ్ళిన కారణంగా ఆయన సదా చిరంజీవి, అమరుడు అనడానికి. We never miss RR.

# రాజకీయ స్వేచ్ఛకు సరిహద్దులు ఎక్కడ?

నారాయణ

రాజకీయాల్లో మాటల స్వేచ్ఛ అనేది ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు. అయితే అదే స్వేచ్ఛ బాధ్యత లేకుండా ఉపయోగించబడితే, అది వ్యక్తిగత పరువు నష్టం, చట్టపరమైన సమస్యలకు దారి తీస్తుంది. ఇటీవల పవన్ ఖేరా కేసులో గౌహతి హైకోర్ట్ చేసిన వ్యాఖ్యలు ఈ సున్నితమైన సరిహద్దును స్పష్టంగా చూపించాయి.

ఈ వివాదం ఒక రాజకీయ ఆరోపణతో ప్రారంభమైంది. అస్సాం ముఖ్యమంత్రి భార్య రింకు శర్మపై విదేశీ పాస్‌పోర్టులు, విదేశీ పెట్టుబడులు ఉన్నాయని చేసిన ఆరోపణలు రాజకీయ వేదికలపై వినిపించాయి. ఈ ఆరోపణలపై అస్సాం క్రైమ్ బ్రాంచ్ కేసు నమోదు చేయడంతో, విషయం చట్టపరమైన దిశగా మళ్లింది. ఇక్కడే ఒక ముఖ్యమైన ప్రశ్న ముందుకు వచ్చింది రాజకీయంగా చేసిన వ్యాఖ్యలు చట్టపరమైన బాధ్యత నుంచి విముక్తి ఇస్తాయా?

గౌహతి హైకోర్ట్ ఈ విషయంలో స్పష్టమైన



సందేశాన్ని ఇచ్చింది. రాజకీయాల్లో లేని వ్యక్తిని వివాదంలోకి లాగడం తగదని కోర్ట్ గట్టిగా పేర్కొంది. ముఖ్యంగా, ఆధారాలు లేకుండా చేసిన ఆరోపణలు కేవలం పరువు నష్టం సమస్యకే పరిమితం కాకుండా, ఫోర్జరీ, కుట్ర వంటి తీవ్రమైన కోణాలను కూడా కలిగి ఉండవచ్చని కోర్ట్ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో "కస్టోడియల్ ఇంటరాగేషన్ అవసరం" అని చెప్పడం, కేసు తీవ్రతను సూచిస్తోంది.

బెయిల్ నిరాకరణకు కూడా ఇదే కారణంగా మారింది. ఖేరా వద్ద ఉన్నట్లు చెప్పబడుతున్న పత్రాల మూలం ఏమిటి? అవి నిజమా? నకిలీనా? ఎవరు అందించారు? వంటి కీలక ప్రశ్నలకు సమాధానం కనుగొనాలంటే కస్టడీ విచారణ అవసరమని కోర్ట్ భావించింది. కేవలం రాజకీయ వ్యాఖ్యలుగా దీనిని తేలిగ్గా తీసుకోలేమని ఈ నిర్ణయం సూచిస్తోంది.

ఈ కేసు ప్రయాణం కూడా భారత న్యాయవ్యవస్థలోని వివిధ స్థాయిల స్పందనను చూపించింది. తెలంగాణ హైకోర్ట్ తాత్కాలిక ఉపశమనం ఇచ్చినప్పటికీ, సుప్రీంకోర్ట్ జోక్యం చేసుకొని ఆ ఆర్డర్‌ను నిలిపివేసింది. చివరకు గౌహతి హైకోర్ట్ బెయిల్‌ను తిరస్కరించడం ద్వారా కేసుకు మరింత గంభీరత చేకూరింది. ఇక ఖేరా వాదనల ప్రకారం, ఇవి కేవలం ప్రశ్నల రూపంలో అడిగిన రాజకీయ వ్యాఖ్యలే. ఎఫ్ఐఆర్ వెనుక రాజకీయ ఉద్దేశ్యం ఉందని ఆయన ఆరోపిస్తున్నారు. కానీ ఇక్కడ కీలక అంశం "ప్రశ్న అడగడం" అనే స్వేచ్ఛకు కూడా బాధ్యత ఉండాలా అనే దానిపై ఉంది. ఒకవేళ ఆ ప్రశ్నలు నిర్ధారించని పత్రాలపై ఆధారపడి ఉంటే, అవి కేవలం ప్రశ్నలుగానే మిగలవు ఆరోపణలుగా మారతాయి.

ఈ కేసు భారత రాజకీయ వ్యవస్థకు ఒక స్పష్టమైన హెచ్చరికగా నిలుస్తోంది. రాజకీయ నాయకులు చేసే ప్రతి ఆరోపణకు ఆధారాలు అవసరం. లేకపోతే, ప్రజాస్వామ్య వేదికలు వ్యక్తిగత దూషణలకు మారే ప్రమాదం ఉంది. అదే సమయంలో, రాజకీయాల్లో లేని వ్యక్తుల గోప్యతను రక్షించడం కూడా న్యాయవ్యవస్థ బాధ్యతగా కోర్ట్ గుర్తుచేసింది.

మొత్తంగా పవన్ ఖేరా కేసు ఒక కీలక ప్రశ్నను లేవనెత్తుతోంది:

రాజకీయ స్వేచ్ఛ పేరుతో ఏదైనా చెప్పొచ్చా?

లేక చట్టపరమైన బాధ్యతలు, నైతిక పరిమితులు తప్పనిసరిగా పాటించాలా?

ఈ ప్రశ్నకు సమాధానం స్పష్టంగా ఒకటే ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛకు విలువ ఉన్నట్టే, బాధ్యతకు కూడా అంతే విలువ ఉంది.

# గాజా జర్నలిస్టు మృతులు 262 మంది

గాజాలో యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు 262 మంది జర్నలిస్టులు మరణించారు. ప్రతి సంవత్సరం మే మూడో తేదీన ప్రపంచ పత్రిక దినోత్సవం సందర్భంగా పాలస్తీనా ప్రభుత్వ మీడియా కేంద్రం ఈ ప్రకటన చేసింది. పాలస్తీనా మీడియా ఆరబ్-48 చెప్పిన సమాచారం ప్రకారం 2023 అక్టోబరు ఏడో తేదీన యుద్ధం మొదలైనప్పటి నుంచి 262 మంది పాత్రికేయులు మరణించడంతో పాటు మరో 420 మంది పాత్రికేయులు తీవ్రంగా గాయపడ్డారని ముగ్గురు పాత్రికేయులు ఆచూకీ ఇప్పటివరకు తెలియలేదని తెలిపింది. గాజా పాత్రికేయులు దిన దిన గండంగా వృత్తి జీవితాలు గడుపుతున్నారని తెలిపింది. మరణం, ప్రత్యక్ష లక్ష్యం ఈ రెండే మీడియాకు ప్రధాన అంశాలుగా మారాయని తెలిపింది. చాలామంది గాయపడిన పాత్రికేయులకు అవయవాలు కూడా తొలగించారని, దాదాపు 50 మంది పాత్రికేయులను అరెస్టు చేశారని వారు అత్యంత కఠిన పరిస్థితుల్లో ఉన్నారని తెలిపింది. ఈ చర్యలన్నీ మానవతా చట్టాల ఉల్లంఘనే కాకుండా అంతర్జాతీయ నేరాల కిందకు వస్తాయని పేర్కొంది. పాలస్తీనా పాత్రికేయులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఆపేసి వారికి రక్షణ ఇవ్వడానికి అంతర్జాతీయ స్థాయిలో చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల సంఘాలకు, అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేసింది. ఇజ్రాయిల్ చర్యల పట్ల మౌనం వహిస్తే అంతర్జాతీయ న్యాయం చట్టం బలహీనపడుతుందని హెచ్చరించింది.

# సంక్షోభంలోనూ వికసిస్తున్న స్వతంత్ర గళాలు!



**కృష్ణ కానూరి**

ప్రజాస్వామ్యం అనే భవనానికి జర్నలిజం నాలుగో స్తంభం. ఆ స్తంభం బలంగా ఉన్నంతకాలమే సమాజంలో పారదర్శకత, జవాబుదారీతనం వెల్లివిరుస్తాయి. నేడు ప్రపంచవ్యాప్తంగా జర్నలిజం ఒక తీవ్ర భూకంపాన్ని ఎదుర్కొంటోంది. రాజకీయ ఒత్తిళ్లు, కార్పొరేట్ శక్తుల గుత్తాధిపత్యం, ఆర్థిక సంక్షోభం, పెరుగుతున్న ప్రజా అపనమ్మకం మధ్య 'నిజం' చిక్కుకుపోయింది. ఇన్ని సవాళ్ల మధ్య కొన్ని సంస్థలు భయపడకుండా లొంగిపోకుండా సత్యాన్ని వెలికితీస్తూ ప్రపంచానికి ఆశాకిరణాలుగా నిలుస్తున్నాయి. అమెరికా రాజ్యాంగంలోని మొదటి సవరణ ప్రెస్‌కు ప్రపంచంలోనే బలమైన చట్టపరమైన రక్షణను కల్పిస్తోంది. కేవలం చట్టం ఉంటే సరిపోదని, పౌర సమాజం నుంచి లభించే మద్దతు ఉంటేనే జర్నలిజం మనుగడ సాగించగలదని నేటి పరిణామాలు నిరూపిస్తున్నాయి. అమెరికాలో మీడియాపై రాజకీయ దాడులు పెరిగినప్పటికీ కొన్ని ప్రతిష్టాత్మక సంస్థలు నిష్పాక్షిక రిపోర్టింగ్‌కు నిలువుటద్దాలుగా నిలుస్తున్నాయి. వార్తా ప్రపంచంలో అసోసియేటెడ్ ప్రెస్ ఒక దిక్సూచి వంటిది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి మూలలోనూ నెట్‌వర్క్ ఉన్న ఏకైక సంస్థగా ఇతర వార్తా చానల్లో కూడా తమ వార్తల విశ్వసనీయత కోసం ఏపీ పైనే ఆధారపడతాయి. ఇక 'ప్రోపబ్లికా' వంటి సంస్థలు ఇన్వెస్టిగేటివ్ జర్నలిజంకు కొత్త అర్థాన్ని ఇస్తున్నాయి. అమెరికా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల అనైతిక ప్రవర్తన లేదా అత్యంత సంపన్నుల పన్ను ఎగవేతలపై వీరు చేసే లోతైన పరిశోధనలు కేవలం వార్తలు మాత్రమే కాదు అవి చట్టాలు సవాలు చేసే ఆయుధాలు. ప్రభుత్వాలు దాచి పెట్టాలనుకునే చీకటి రహస్యాలు వెలుగులోకి తెస్తూ ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని పారదర్శకత ఒక్కటే అధికార దుర్వినియోగానికి విరుగుడని ఈ సంస్థలు నిరూపిస్తున్నాయి. వాణిజ్య ప్రకటనల హోరు, రేటింగ్స్ కోసం సాగే అర్థరహిత చర్చలు లేని జర్నలిజం ఎలా ఉంటుందో నేషనల్ పబ్లిక్ రేడియో(ఎన్ పి ఆర్), పబ్లిక్ బ్రాడ్కాస్టింగ్ సర్వీస్ (పిబిఎస్) సంస్థలను చూస్తే అర్థమవుతుంది. కేవలం ప్రజల విరాళాలు, చిన్నపాటి ప్రభుత్వ గ్రాంట్లపై ఆధారపడి నడిచే ఈ సంస్థలు క్లిష్టమైన సామాజిక అంశాలను సరళంగా శాస్త్రీయంగా వివరిస్తాయి. మిగిలిన మీడియా ఛానళ్లు భావోద్వేగాలను రెచ్చగొట్టే లాభాలను వెతుక్కునే చోట ఇవి పరిష్కారాలను. వాస్తవ విశ్లేషణలను వెతుకుతాయి. ముఖ్యంగా 'న్యూస్‌డెసర్టులు'గా మారిన గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంస్థలు అందించే వార్తలు ప్రజలకు ప్రాణవాయువులా పనిచేస్తున్నాయి. లాభం కంటే లోక కళ్యాణమే ప్రధానమని వీధి విధానం. విచ్ఛిన్నమవుతున్న సమాజంలో మీడియాపై పోయిన నమ్మకాన్ని పునరుద్ధరించడమే కాకుండా పౌరులను ఆలోచింపజేసే మేధో వేదికలుగా మారుతున్నాయి. ఈ సంస్థల మనుగడ కేవలం రాజ్యాంగంలోని మొదటి సవరణ కల్పించే చట్టపరమైన రక్షణల మీద మాత్రమే ఆధార పడలేదు. అది సత్యాన్ని ప్రేమించే పౌరసమాజం, పౌర సమాజం వెన్నుదన్నుతో సాగుతోంది. రాజకీయ నాయకులు ఈ సంస్థలపై దాడులకు దిగినప్పుడు లేదా నిధులను నిలిపివేయాలని ప్రయత్నించినప్పుడు సామాన్య ప్రజలు విరాళాల రూపంలో అండగా నిలబడి వీటి స్వాతంత్ర్యాన్ని కాపాడుతున్నారు. భారతదేశంలో ప్రధాన స్రవంతి మీడియా కార్పొరేట్ ప్రయోజనాల కోసం మౌనం వహిస్తున్న వేళ ది వైర్, స్క్రోల్, న్యూస్ క్లిక్ వంటి స్వతంత్ర సంస్థలు నిజాన్ని నిర్భయంగా వినిపిస్తున్నాయి. పెగాసస్ గూఢచర్య ఉదంతం నుంచి రైతుల నిరసనల

## స్వతంత్ర గళాలు!

వరకు వీరు వెలుగులోకి తెచ్చిన కథనాలు అధికార వర్గాలను ఉలిక్కిపడేలా చేశాయి. ప్రపంచవ్యాప్తంగా నియంతృత్వ ధోరణులు పెరుగుతున్న చోట స్వతంత్ర జర్నలిజం ప్రాణాలకు తెగించి పోరాడుతోంది. ఫిలిప్పీన్స్‌లో నోబెల్ గ్రహీత మారియా రెస్సా నేతృత్వంలోని రాప్లర్ సంస్థ ప్రభుత్వం చేపట్టిన డ్రగ్ వార్‌లోని అతిక్రమణలను ఎండగట్టినందుకు అనేక అరెస్టు వారెంట్లను, పరువు రాష్ట్రం కేసులను ఎదుర్కొంది. రష్యాలో నోవాయా గెజిటా వంటి పత్రికలు ప్రభుత్వ ఆంక్షల వల్ల బహిష్కరణకు గురైనా విదేశాల నుంచి తమ దేశ వాస్తవాలను ప్రపంచానికి తెలియజేస్తున్నాయి. హంగరీలో అతిపెద్ద వార్తా సంస్థ ప్రభుత్వం చేతుల్లోకి వెళ్ళినప్పుడు అక్కడి జర్నలిస్టులు సామూహికంగా రాజీనామా చేసి టెలెక్స్ అనే స్వతంత్ర సంస్థను ప్రజల నిధులతో ప్రారంభించారు. ఈ సంస్థల కథనాలు ఆయా దేశాల్లో అణిచివేసిన ప్రజల ఆర్తనాదాలు, స్వేచ్ఛ ఆకాంక్షలు. ఈ అక్షర యోధులు చేసే పోరాటం కేవలం వారి వృత్తి కోసం కాదు. భావితరాల స్వేచ్ఛ కోసం. ఒక స్వతంత్ర వార్తాసంస్థ మూత పడిందంటే అక్కడ అవినీతికి ఎదురులేకుండా పోయిందని అర్థం. ప్రభుత్వాలు, కార్పొరేట్ శక్తులు ప్రకటనలు నిలిపివేసి ఈ సంస్థల గొంతు కోయాలని చూస్తున్నప్పుడు పౌర సమాజమే కాపాడాలి. సత్యాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరూ ఈ స్వతంత్ర గళాలకు ఆర్థికంగా, నైతికంగా అండగా నిలబడాలి. నిజం కోసం పోరాడే జర్నలిస్టులకు అండగా నిలబడడం అంటే మన ప్రజాస్వామ్యాన్ని మనం కాపాడుకోవడమే. నేడు ప్రపంచవ్యాప్తంగా వందల సంఖ్యలో జర్నలిస్టుల అరెస్టులు, వేల సంఖ్యలో ఉద్యోగాల కోత, రాజకీయ నాయకుల నుంచి ఎదురవుతున్న బహిరంగ వేధింపులు జర్నలిజం వ్యవస్థను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. అయితే ఈ భౌతిక దాడులు అక్షరాన్ని తాత్కాలికంగా బలహీన పరచవచ్చు. కానీ గుండెల్లో దాగి ఉన్న సత్యాన్ని ఎప్పటికీ చంపలేవు. మే మూడున మనం జరుపుకునే ఈ దినోత్సవం కేవలం జర్నలిస్టుల కోసం మాత్రమే కాదు. అది నిజాలను తెలుసుకునే ప్రాథమిక హక్కు ఉన్న ప్రతి పౌరుడి కోసం ఉద్దేశించిన ఒక హెచ్చరిక. స్వతంత్ర జర్నలిజం లేని సమాజం చుక్కానీ లేని నావ వంటిది. అది ఏ క్షణంలోనైనా తప్పుడు సమాచారపు తుఫానులో మునిగిపోవచ్చు. జర్నలిజం బలహీనపడితే సమాజంలో అవినీతి పెచ్చరిల్లుతుంది. ప్రశ్నించే గొంతు మూగబోతుంది. అందుకే మే మూడున ఒక సంకల్పం చేద్దాం. భయపడకుండా నిజం చెప్పే జర్నలిస్టుల ధైర్యాన్ని అభినందిద్దాం. సత్యం వైపు నిలబడే స్వతంత్ర మీడియా సంస్థలకు వెన్నుదన్నుగా నిలుద్దాం. సత్యం అజేయం. అది ఎప్పటికైనా వెలుగులోకి వచ్చి తీరుతుంది. ఆ వెలుగును కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిదీ.

**(విశాలాంధ్ర దినపత్రిక సౌజన్యంతో)**

# పీఎఫ్ ఖాతాదారులకు శుభవార్త

ప్రైవేట్ రంగంలో ఉద్యోగుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన గొప్ప సామాజిక భద్రతా పథకం ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్. దీనిని ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ నిర్వహిస్తోంది. కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇది పనిచేస్తుంది. ఇప్పుడు ఈపీఎఫ్‌వోకు సంబంధించి కార్మిక శాఖ ఒక కీలక ప్రకటన చేసింది. ఇది ఒక రకంగా శుభవార్త. ఈపీఎఫ్ ఇనాపరేటివ్ ఎకౌంట్లకు సంబంధించి అన్ క్లెయిమ్ డిపాజిట్లను వారి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయం తీసుకుంది. క్లెయిమ్ చేయని వారి పీఎఫ్ ఖాతాల్లో పెద్ద మొత్తంలో నిధులు పోగువడగా వీటిని చందాదారుల ఖాతాల్లోకి బదిలీ చేయాలని నిర్ణయించడం విశేషం. ఈ కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో సుమారు 31 లక్షల మంది పథకం చందాదారులకు ప్రయోజనం చేకూరుతుంది. అయితే పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టే తొలి దశలో సుమారు 7 లక్షల మంది వరకు ఈ ప్రయోజనం పొందుతారని కేంద్ర కార్మిక మంత్రి మన్‌సుఖ్ మాండవియ చెప్పుకొచ్చారు. త్వరలోనే అది ప్రారంభమవుతుందని తెలియజేశారు. ఈపీఎఫ్ఓ వీక్లీ రివ్యూ మీటింగ్‌లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మాండవియ వివరించారు. ప్రస్తుతానికి 31.86 లక్షల వరకు పిఎఫ్ ఖాతాలు నిర్వహణలో లేవని ఈపీఎఫ్ఓ గుర్తించింది. దీంట్లో సుమారు పదివేల తొమ్మిది వందల మూడు కోట్ల మేర నిల్వలు ఉన్నట్లు అంచనా వేస్తోంది. వీటిల్లో సుమారు 7.11 లక్షల ఖాతాల్లో వెయ్యి రూపాయల వరకు మాత్రమే నగదు నిల్వలు ఉన్నట్లు పేర్కొంది. వీటి విలువ మొత్తంగా 30.52 కోట్లుగా ఉన్నాయి. కార్మిక శాఖ సమాచారం ప్రకారం ఈ నిర్వహణలో లేని పిఎఫ్ ఖాతాల్లో 20 ఏళ్లకు పైబడినవి కూడా ఉన్నాయి. దాదాపు మూడేళ్లుగా ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించని పిఎఫ్ అకౌంట్లను ఇనాపరేటివ్ ఎకౌంటుగా పేర్కొంటారు. ఇప్పుడు ఈపీఎఫ్‌వోకు సంబంధించి కార్మిక శాఖ ఒక కీలక ప్రకటన చేసింది ఇది ఒక రకంగా శుభవార్త.



# ప్రసార భారతి చైర్మన్ ప్రసూన్ జోషి

ప్రసార భారతి చైర్మన్‌గా ప్రముఖ గీత రచయిత కవి ప్రసూన్ జోషి నియమితులయ్యారు. ఈ మేరకు సమాచార ప్రసార శాఖ ప్రకటించింది. అంతర్జాతీయ చలనచిత్ర డైరెక్టర్‌గా, ప్రఖ్యాత దర్శకుడు అశుతో గోవారికర్ నియమితులైన విషయం తెలిసిందే. డిసెంబర్‌లో నవనీత్ కుమార్ రాజీనామానంతరం ప్రసార భారతి చైర్మన్ పదవి ఖాళీగా ఉన్నది. ప్రస్తుతం జోషి సాహిత్యంలో అడ్వర్టైజింగ్, సినిమా, పబ్లిక్ కమ్యూనికేషన్ రంగాల్లో తనదైన గుర్తింపు సాధించారు. మంచి రచయితగా పేరుగాంచారు. ప్రసార భారతి బోర్డు చైర్మన్‌గా నియమితులైనందుకు ప్రస్తుతం జోషికి కేంద్ర మంత్రి అశ్విన్ వైష్ణవి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకత్వంలో ప్రసార భారతి నూతన ఉత్సాహంతో పనిచేయగలరని ఆకాంక్షించారు. ప్రస్తుతం జోషి 2017 ఆగస్టు నుంచి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ ముంబై చైర్పర్సన్‌గా పనిచేశారు. సినిమా రంగానికి గణనీయమైన తోడ్పాటు అందజేశారు. అదే విధంగా వరల్డ్ గ్రూప్ ఇండియా సిఇఓగా మెక్కాన్ వరల్డ్ గ్రూప్ ఆసియా పసిఫిక్ చైర్మన్‌గా పనిచేశారు. 2006 నుంచి ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ ట్రస్ట్‌లో ఒకరిగా పనిచేస్తున్నారు.

# ఏపీబీజేఏ మైలవరం నియోజకవర్గ కమిటీ ఎన్నిక




ఏపీ బీ జే ఏ (APBJA) మైలవరం నియోజకవర్గం నూతన కమిటీ

ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఏపీబీజేఏ మైలవరం నియోజకవర్గ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ప్రజా ప్రెస్ క్లబ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మైలవరం నియోజకవర్గం అధ్యక్షులుగా వుయ్యూరు వెంకట్ (సాక్షి టీవీ), కార్యదర్శిగా దాసి ప్రతాప్ (6 టీవీ ) కోశాధికారిగా కాలగడ్డ మనోహర్ (వీ టీవీ), సహాయ కార్యదర్శిగా అవుట్ సుశీల్ దేవ్ (మెగా 9 టీవీ), ఉపాధ్యక్షులుగా ఎం రమేష్ ( రాజ్ న్యూస్) కమిటీ సభ్యులుగా గుంజి నాగరాజు (10 టీవీ), రాజీవ్ రాజ్ లను (వే టు న్యూస్) వారిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ ఎన్టీఆర్ జిల్లా నాయకులు ఎం.రాఘవులు మాట్లాడుతూ ఈ కమిటీ ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో పనిచేస్తుందని ఎలక్ట్రాన్ మీడియా రంగంలో ఉన్న జర్నలిస్టుల సమస్యలపై ఈ కమిటీ పని చేస్తుందని వివరించారు. ఈ సమావేశంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ మైలవరం నియోజకవర్గ కమిటీ గౌరవ అధ్యక్షులు టంగుటూరి శ్రీనివాస్, అధ్యక్షులు షేక్ సల్మాన్, ప్రజా ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు అవుటి బాబు, ప్రధాన కార్యదర్శి చల్లా రవీంద్ర, ప్రజా ప్రెస్ క్లబ్ మీడియా కోఆర్డినేటర్ పల్లె నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టు జగదీష్ మృతి

మెట్రో ఉదయం పత్రికలో పనిచేస్తున్న పి.జగదీష్ కుమార్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన లష్కర్ గుడా గ్రామానికి చెందినవారు. అబ్దుల్లాపూర్మెట్ మండల విలేకరిగా పనిచేస్తున్నారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరారు. ఆయన ఆరోగ్యం విషమించి తుది శ్వాస విడిచారు. జగదీష్ మృతి పట్ల నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ తెలంగాణ శాఖ కన్వీనర్ ఎం ఎ రవూఫ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# దుర్బా ఘోష్‌కు జర్నలిజం అవార్డు

2026 సంవత్సరానికి గాను 'బ్రహ్మపుత్ర వ్యాలీ జర్నలిజం అవార్డు'కు సీనియర్ జర్నలిస్ట్, పిటిఐ ప్రతినిధి అయిన దుర్బా ఘోష్‌ను అస్సాం రాష్ట్ర జర్నలిస్టుల సంఘం ఎంపిక చేసింది. అస్సాం జర్నలిజం రంగంలో ఆమె చేసిన సుదీర్ఘమైన, విశేషమైన సేవలను గుర్తించిన సంఘం నియమించిన ఒక జ్యూరీ బోర్డు అధికారిక సమావేశంలో ఈ ఎంపికను ఖరారు చేసింది. చరాయిదేవ్ జిల్లాలోని సొనారిలో, సంఘం వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని మే 10న జరిగే ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆమెకు ఈ అవార్డును ప్రదానం చేశారు. సంఘం అధ్యక్షుడు జితు రాజ్‌ఖోవా, కార్యదర్శి ప్రదీప్ దేకా సంయుక్తంగా విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో ఈ విషయాన్ని తెలియజేశారు. ఘోష్ జార్ఖండ్ రాజధాని అయిన రాంచీలో జన్మించారు. కోల్‌కతాలో ఆర్థికశాస్త్రంలో పట్టా పొందారు. ఆమె జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్‌లో స్నాతకోత్తర పట్టా పొందారు. ఆమె తన వృత్తి జీవితాన్ని 1991లో కోల్‌కతాలోని పిటిఐ సంస్థతో ప్రారంభించి, అక్కడ ఆరు సంవత్సరాల పాటు సేవలందించారు.



1998లో ఆమె పిటిఐ గౌహతి బ్యూరోలో చేరారు. అప్పటి నుండి నిరంతరాయంగా అక్కడే సేవలందిస్తున్నారు.



## జర్నలిస్టు రవి మృతి

విశాఖపట్నంలో వివిధ ఎలక్ట్రానిక్ మీడియా ఛానళ్లలో పనిచేసి అనారోగ్యం పాలైన పాలికి రవి (45) మృతి చెందారు. ఆయన ఐన్యూస్, సుమన్ టివి, 99టివిల్లో పనిచేశారు. అనారోగ్యం పాలవడంతో కొంతకాలంగా అరిలోవ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.నారాయణ్, జి.శ్రీనివాసరావులు సంతాపం వ్యక్తం చేశారు.

# భారత్‌లో పత్రికాస్వేచ్ఛ ఆందోళనకరం

భారత్‌లో మైనారిటీల హక్కులు, పత్రికా స్వేచ్ఛ, చట్టబద్ధమైన పాలన స్థితిగతులపై నెదర్లాండ్స్ ప్రధానమంత్రి రాబ్ జెట్టెన్ ఆందోళన వ్యక్తం చేశారు. నెదర్లాండ్‌లోనే కాదు యూరోపియన్ యూనియన్ సభ్య దేశాల్లోనూ భారత్‌లో ఉన్న పరిస్థితులపై ఆందోళన నెలకొని ఉందన్నారు. ప్రధాని మోడీ నెదర్లాండ్స్ పర్యటనకు ముందు స్థానిక మీడియా సంస్థలతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే మోడీ నెదర్లాండ్స్ పర్యటన ముగించుకొని స్వీడన్‌కు వెళ్లిన తరువాత మీడియాలో కనిపించాయి. పత్రికా స్వేచ్ఛ మాత్రమే కాదు, మైనారిటీల హక్కులు, చట్టబద్ధ పాలన కూడా ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని అన్నారు. ముఖ్యంగా ముస్లింల మీద ఇది అధికంగా ఉంది. ఇతర అల్ప సంఖ్యాక మైనారిటీల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. పౌరులందరికీ సమాన హక్కులు వర్తించే సమీకృత సమాజంగా భారత్ ఏ మేరకు నిలిచి ఉందనేదే మా ఆందోళన అంతా. మా అభ్యంతరాలను భారత ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నామని జెట్టెన్ వెల్లడించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో ఆర్థిక అంశాలే గాక ఇతర అంశాల గురించి కూడా మాట్లాడే అవకాశం లభించింది అన్నారు. అందువల్ల భారత్‌లో మానవ హక్కులు ప్రజాస్వామ్యాన్ని పటిష్ట పరచడం, చట్టబద్ధ పాలన మొదలైన వాటి గురించి మాట్లాడుతున్నామన్నారు. భారత్‌లో ఉన్న నెదర్లాండ్స్ బాలిక ఇన్సియా హిమాని స్వదేశానికి రప్పించడం గురించి సంప్రదింపులు జరుపుతామని చెప్పారు. భారతీయుడైన షెహజాద్ బలవంతంగా తన బిడ్డను భారత్‌కు తీసుకువచ్చాడు. అప్పుడు ఇన్సియా వయసు రెండేళ్లు. తన కుమార్తెను తిరిగి తనకు అప్పగించాలని గత పదేళ్లుగా ఇన్సియా తల్లి నాదియా రషీద్ న్యాయపోరాటం చేస్తున్నారు. కాగా మోడీ, జెట్టన్ మధ్య జరిగిన చర్చల్లో భారత్లో మైనారిటీల పరిస్థితి, పత్రికా స్వేచ్ఛ తదితర అంశాల ప్రస్తావన రాలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# సీనియర్ జర్నలిస్టు శౌర్యకుమార్ మృతి



హైదరాబాద్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు బి. శౌర్య కుమార్ కన్నుమూశారు. నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు తెలంగాణ శాఖ కన్వీనర్ ఎం.ఎ.రవూఫ్ ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

# సంజయ్ కుమార్ మృతి




భారత ప్రభుత్వ ప్రచురణల విభాగం, యోజన (తెలుగు)కు 40 సంవత్సరాల పాటు సేవలందించిన సంజయ్ కుమార్ ఎగురి హైదరాబాద్‌లో ఏప్రిల్ 7వ తేదీ మరణించారు. ఆయన మృతి పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ తెలంగాణ శాఖ కన్వీనర్ ఎం.ఎ.రవూఫ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

# నైరూప్య చిత్రకారుడు అలెక్స్ ఇక లేరు




ప్రఖ్యాత నైరూప్య చిత్రకారుడు, ఆంధ్రజ్యోతి పూర్వ ఉద్యోగి, అంతర్వాణి క్రీస్తుసువార్త మాసపత్రిక వ్యవస్థాపక సంపాదకుడు మద్దాల జేమ్స్ అలెగ్జాండర్ అలియాస్ అలెక్స్ విజయవాడలో కన్నుమూశారు. అలెగ్జాండర్ కొంతకాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన వయసు 70 సంవత్సరాలు. అలెగ్జాండర్ ఆంధ్రజ్యోతిలో పేజీ లే అవుట్ ఆర్టిస్టుగా, చిత్రకారుడిగా చాలాకాలం పని చేశారు . ఆయనకు భార్య శ్రీలక్ష్మి, నిఖిలేష్, తేజ, రాకేష్ ముగ్గురు కుమారులు వున్నారు. ఆయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కలిమిశ్రీ, ఎం.బి.నాథన్‌లు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# సూర్య ప్రసాద్ మృతి



సాక్షి దినపత్రికకు కూర్మన్నపాలెం విలేకరిగా పనిచేస్తున్న కుప్పిలి సూర్యప్రసాద్ అకాల మరణం చెందారు. సూర్యప్రసాద్‌కు ఇద్దరు కుమార్తెలు. ఆయన భార్య గతంలోనే మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి నారాయణ్, జి శ్రీనివాసరావులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# సీనియర్ జర్నలిస్టు గణపతిరావు మృతి



మృదు స్వభావి, సీనియర్ జర్నలిస్ట్ పోలమరశెట్టి గణపతిరావు విజయవాడలో మృతి చెందారు. గణపతిరావు ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, సన్ ఫ్లవర్ న్యూస్, సూర్య పత్రికలలో పనిచేశారు. అరుదైన, అభిజాత్యం లేని గణపతిరావు మరణం ఎందరికో దిగ్భ్రాంతికి గురి చేసింది.ఆయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శ్రీనివాస్, ఎం.బి.నాథన్‌లు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.



మదనపల్లిలో జరిగిన ఫెడరేషన్ అన్నమయ్య జిల్లా కార్యవర్గ సమావేశ దృశ్యం






ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై బనాయించిన అక్రమ కేసులు తొలిగించాలని కోరుతూ విజయవాడ, తిరుపతిలో ఫెడరేషన్ అధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమాలు

# రైతన్నకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం

'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్'

అన్నదాతకు ఏటా
**రూ.20,000ల**
ఆర్థిక సాయం

2025-26 సంవత్సరానికి
రైతుల ఖాతాల్లో
**రూ.8985.41 కోట్లు** జమ

రాష్ట్రంలోని
**46,85,838**
మంది రైతులకు లబ్ధి


రాష్ట్ర వాటా రూ.6560.18 కోట్లు, కేంద్ర వాటా రూ.2425.23 కోట్లు

గౌ|| భారత ప్రధాని
**శ్రీ నరేంద్ర మోదీ గారి సహకారంతో..**

గౌ|| ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
**శ్రీ నారా చంద్రబాబునాయుడు గారిచే**

**అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకంలో భాగంగా**
**మూడో విడత కింద రూ.6,000లు జమ**

సూపర్ 6



అన్నదాత సుఖీభవ పథకం - రైతన్నకు వరం